


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


## కులగణనతో సామాజిక న్యాయ పునాధులు బలోపేతం

**- చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): దేశంలో జనాభా లెక్కల సమయంలోనే కులగణన చేపట్టాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. కులగణనపై కేబినెట్ నిర్ణయం ప్రధాని మోదీ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. కులగణన బడుగు వర్గాల అవసరాలు తీర్చుతుందని పేర్కొన్నారు. దీనివల్ల సామాజిక న్యాయ పునాదులు బలోపేతమవుతాయని చంద్రబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు.

---

## మేడేవేళ ఎంఎస్ఎంఈ పార్కులు

**ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): ప్రపంచ కార్మికుల దినోత్సవం 'మే డే'ను పురస్కరించుకుని ఏపీ సీఎం చంద్రబాబు 11 ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభించనున్నారు. ఒక ఫ్లోటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సునూ ఆయన ప్రారంభిస్తారు. వీటితో పాటు మరో 14 ఎఫ్ఎల్సీలు, 25 కొత్త ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. నెల్లూరు జిల్లా నారంపేటలో వీటికి సీఎం శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పనుంది. 2028 కల్లా 15,000 ఎంఎస్ఎంఈ యూనిట్లు, 2 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకుంది.

# తీవ్ర విషాద ఘటన





- సింహాచలంలో గోడకూలి ఏడుగురి మృతి
- సీఎం చంద్రబాబు, పీఎం మోదీ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- ఉన్నతాధికారులు, మంత్రులతో సీఎం టెలికాన్ఫరెన్స్
- క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలకు ఆదేశం
- గోడ కూలిన ఘటనపై త్రిసభ్య కమిటీతో విచారణ
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం,
- క్షతగాత్రులకు రూ.3 లక్షల ఆర్థిక సాయం
- బాధిత కుటుంబాల్లో ఒకరికి దేవాదాయ శాఖలో ఓఎస్ ఉద్యోగం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటానన్న ముఖ్యమంత్రి

2


## కదలండి.. మహాసభకు!

- రాజధాని పనుల పున:ప్రారంభానికి తరలిరావాలని పిలుపు
- రేపు ప్రధాని మోదీ చేతుల మీదుగా మహాక్రతువు మొదలు
- తెదేపా శ్రేణులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



3

## యువతకు నైపుణ్య పదును



- సాధికారత సాధనకు సర్కారు బాటలు
- యునిసెఫ్‌తో ప్రభుత్వం కీలక ఒప్పందం
- 2 లక్షలమందికి వ్యాపార నైపుణ్యాల పెంపే లక్ష్యం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూ

3





### ఆ పాదం ఎక్కడ పెడితే అక్కడ శవాలు లేవాల్సిందే

*జగన్ సొంత జిల్లాలో అన్నమయ్య డ్యాం మృతులకు ప్రతిపక్షంలో ఉన్న నారా భువనేశ్వరి వెళ్లి రూ.40 లక్షలకు పైగా ఆర్థిక సాయం చేయడం జరిగింది. కానీ జగన్ సింహాచలం వెళ్లి బాధితులకు ఒక్క రూపాయి ఇవ్వకుండా సత్వర సహాయం చేసిన చంద్రబాబుపైనే నిందలు వేయడం జరిగింది. జగన్‌ది శవ రాజకీయమే కానీ.. సేవా రాజకీయం కాదు. జగన్ తండ్రి పాలనలో దుర్గగుడి తొక్కిసలాటలో 7 మంది భక్తుల ప్రాణాలు పోయాయి. జగన్ పాలనలో శ్రీకాళహస్తిలో గాలిగోపురమే నిలువునా కూలి పోయింది. రాష్ట్రవ్యాప్తంగా అనేక దేవాలయాల్లో రథాలే కాలిపోయాయి. వీటన్నింటికీ జగన్ పాదమే కారణమా?*



## దుర్ఘటనపై శవరాజకీయాలా?

- వైసీపీ నేత జగన్‌పై మంత్రి అచ్చెన్న ఫైర్
- జగన్ హయాంలో ఎంత పరిహారం ఇచ్చారు..
- సమాధానం చెప్పాలంటూ మంత్రి డిమాండ్

5

# గోడకూలి ఏడుగురు భక్తులు మృతి





- సింహాచలంలో తీవ్ర విషాద ఘటన
- పీఎం మోదీ, సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- ఉన్నతాధికారులు, మంత్రులతో సీఎం టెలీకాన్ఫరెన్స్
- క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలకు ఆదేశం
- గోడ కూలిన ఘటనపై త్రిసభ్య కమిటీతో విచారణ
- మృతుల కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం, క్షతగాత్రులకు రూ.3లక్షల ఆర్థిక సాయం
- బాధిత కుటుంబాల్లో ఒకరికి దేవాదాయ శాఖలో ఓఎస్ ఉద్యోగం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటానన్న ముఖ్యమంత్రి

సింహాచలం (చైతన్య రథం): విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హెూంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్‌వేర్ దంపతులు పిల్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్టు నిర్ధారించారు. వీరంతా విశాఖపట్నం నగరానికి చెందినవారు.

## మృతుల వివరాలు..

తూర్పు గోదావరి జిల్లా మాచవరానికి చెందిన పత్తి దుర్గాస్వామి నాయుడు (32), కుమ్మపట్ల మణికంట (28), విశాఖజిల్లా అడవివరానికి చెందిన ఎడ్ల వెంకటరావు (48), వెంకోజీపాలెం హెచ్‌బీ కాలనీకి చెందిన గుజ్జరి మహాలక్ష్మి (65), ఉమానగర్‌కు చెందిన పైలా వెంకటరత్నం (45), మధురవాడ చంద్రంపాలానికి చెందిన పిల్లా ఉమామహేశ్ (30), పిల్లా శైలజ (26) ప్రమాదంలో మృతిచెందారు.

## సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గోడకూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలిరాగా, అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి క్యూలైన్‌లో గోడ కూలి భక్తులు చనిపోవడం బాధాకరమన్నారు. ఘటనలో గాయాలైన వారికి అత్యవసర వైద్యసేవలు అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

సింహాచలం ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ.. ప్రధాని మోదీ కార్యాలయం ట్వీట్ చేసింది. పీఎం సహాయ నిధినుంచి ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తూ.. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ప్రకటించారు.

ఘటన గురించి తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు జిల్లా అధికారులు, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామి, అనిత, అనగాని సత్యప్రసాద్, ఎంపీ భరత్, సింహాచల దేవాలయ ధర్మకర్త అశోక్ గజపతి రాజుతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, ఘటన జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయం వివరాలు తెలుసుకున్నారు. గోడ కూలిన ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, చనిపోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. అలాగే, గాయపడిన వారికి రూ.3 లక్షల సాయం ఇవ్వాలని నిర్ణయించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు, గోడ కూలిన ప్రదేశంలో శిథిలాలను వెంటనే తొలిగించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులు భయాందోళనలు చెందకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## 72 గంటల్లో ప్రాథమిక నివేదిక

ఉండవల్లి నివాసంలో సింహాచలం ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రివ్యూకు హాజరైన డీజీపీ, ఉన్నతాధికారులు... ఘటన జరిగిన తీరు, బాధితులకు అందుతున్న సాయంపై అధికారులు వివరించారు. సింహాచలం ఘటనపై విచారణకు ఐఏఎస్, ఐపీఎస్‌లతో కూడిన ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటుకు సీఎం ఆదేశించారు. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ చీఫ్ వెంకటేశ్వరావులతో కమిటీ ఏర్పాటు చేశారు. 72 గంటల్లో ఘటనపై ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కమిటీని సీఎం చంద్రబాబు ఆదేశించారు.







## ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సవిత

అమరావతి(చైతన్య రథం): ప్రధానమంత్రి నరేంద్ర మోడి రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభానికి వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణాన్ని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్ సవిత పరిశీలించారు. బుధవారం రాష్ట్ర ఆర్యవైర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్‌తో కలిసి ఆమె... ప్రధాని సహా ముఖ్య అతిథులు ఆశీనులయ్యే వేదికతోపాటు సభికుల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రాంగణాన్ని పరిశీలించారు. పనులు ఎంతమేరకు జరిగాయని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఐదు లక్షలకు పైగా సభికులు తరలొస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. మండే ఎండలను దృష్టిలో పెట్టుకుని, తాగునీరు, నీడ కల్పించేలా టెంట్లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన వేదిక ఏర్పాట్లలో మంత్రి సవిత పలు సూచనలు చేశారు.

చైతన్యరథం

# కదలండి.. మహాసభకు!

- రాజధాని పనుల పున:ప్రారంభానికి తరలిరావాలని పిలుపు
- రేపు ప్రధాని మోదీ చేతుల మీదుగా మహాక్రతువు మొదలు
- తెదేపా శ్రేణులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



అమరావతి (చైతన్య రథం): రాజధాని అమరావతి నిర్మాణ పనుల పున:ప్రారంభానికి పార్టీ శ్రేణులు పోటెత్తాలని సీఎం చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. మే 2న ప్రధాని మోదీ రాజధాని నిర్మాణ పనులను పున:ప్రారంభించిన దగ్గర్నుంచీ శరవేగంగా పనులు పూర్తి చేసుకుందామని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ.. రాజధానిలో చేపట్టే రూ.49,040 కోట్ల పనులకు శంకుస్థాపన చేయడమే కాదు, రాష్ట్రంలో డీఆర్‌డీవో, డీపీఐఐటీ, ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వేస్‌కు సంబంధించి రూ.57,962 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని సీఎం చంద్రబాబు వివరించారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని టీడీపీ శ్రేణులతో పాటు జనసేన, బీజేపీ కార్యకర్తలు కదలిరావాలని పిలుపునిచ్చారు. 'గత ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఎన్నికల ముందు చెప్పాం. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని 93శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిపించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళు తున్నాయి. ఆర్థిక కష్టాలున్నా ఈ 10 నెలల్లో పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాం. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తాం. విశాఖపట్నంలో టీసీఎస్ స్థాపన ద్వారా భారీగా ఉద్యోగాలు లభిస్తాయి. భోగాపురం విమానాశ్రయాన్ని శరవేగంగా నిర్మిస్తున్నాం. శ్రీసిటీలో ఎల్‌జీ కంపెనీ రూ.5 వేల కోట్లతో పెట్టుబడులు పెట్టనుంది. దేశంలో అత్యధిక పెట్టుబడులు మన రాష్ట్రానికే వస్తున్నాయి. రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు స్వర్ణాంధ్ర విజన్-2047 రూపొందించుకున్నాం. అన్ని ప్రాంతాల అభివృద్ధి ఎన్డీయే లక్ష్యమని చంద్రబాబు ఉద్ఘాటించారు. విశాఖలో ఉర్సా కంపెనీ పెట్టుబడులు పెట్టేందుకు ఎకరా 1.5కోట్లకు కేటాయిస్తే 99 పైసలకే ఇచ్చామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రత్యర్థులపై నిప్పులు చెరిగారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసి తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సాక్షి మీడియాలో ఎప్పుడూ తప్పుడు వార్తలు రాస్తారు. వైసీపీ నేతలు చేసిన తప్పులు ఎవరూ చేయలేదు. వైన్, మైన్, శాండ్, ల్యాండ్... ఇలా అన్నింటిలోనూ దోచుకున్నారు. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా రాజధానికి భూములు సమీకరించాం. రాష్ట్ర భవిష్యత్ కోసం రైతులు భూములు ఇచ్చారు. కానీ గత పాలకులు మూడు రాజధానుల పేరిట రాజధానిని నిర్వీర్యం చేశారు. రాష్ట్ర ప్రజలు, రాజధాని రైతుల పోరాటానికి ఫలితం లభించింది. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, యువత ఆకాంక్ష తీరే విధంగా రాజధాని నిర్మాణం ఉంటుందని చంద్రబాబు అన్నారు. కేంద్రం సహకారంతో రాజధానికి ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రుణం ఇచ్చాయని, కర్నాటక వాళ్లు మా బెంగళూరు, తెలంగాణ ప్రజలు మా హైదరాబాద్, తమిళనాడు వాసులు మా చెన్నై అంటారు. మన రాష్ట్ర ప్రజలు కూడా మా అమరావతి అని గర్వంగా చెప్పుకునేలా రాజధాని నిర్మిస్తామని చంద్రబాబు అన్నారు. 'హైదరాబాద్ అభివృద్ధిలో టీడీపీ పాత్ర చెరగనిది. హైదరాబాద్‌వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఆదాయం వస్తోంది. అమరావతి నిర్మాణం ద్వారా వచ్చే ఆదాయంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరిన్ని చేపట్టవచ్చు. రాజధాని స్వయం ఆధారిత ప్రాజెక్టు. మూడేళ్లలోనే మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తాం. కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించేందుకు నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తున్నాం. జిల్లాల పర్యటనకు వెళ్లిన సమయంలో ఇప్పటికే 8 నియోజకవర్గాల కార్యకర్తలతో నేరుగా సమావేశమయ్యాను. పార్టీకి కార్యకర్తలే మూల స్థంబాలు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో మూడు పార్టీల కార్యకర్తలు పాల్గొనాలి. మెడమీద కత్తి పెట్టినా పార్టీ జండా వదల్లేదు. కార్యకర్తల మనోభావాలకు విరుద్ధంగా ఏ నాయకుడూ వ్యవహరించడానికి అవకాశం లేదు. ప్రభుత్వానికి ఎంత ప్రాధాన్యత ఇస్తానో... కార్యకర్తలకు కూడా అంతే ఇస్తానని చంద్రబాబు ప్రకటించారు. 'కడపలో మహానాడును ఘనంగా నిర్వహించుకుందాం. ఏ ఎన్నికలు జరిగినా ఎన్డీఏనే గెలవాలి. వచ్చే నెలలోనే అన్నదాత, తల్లికి వందనం పథకాలు ప్రారంభిస్తాం. సింహాచలంలో గోడకూలి ఏడుగురు భక్తులు చనిపోవడం బాధాకరం. సంఘటన స్థలానికి వెళ్దామంటే భక్తుల దర్శనాలకు అంతరాయం కలుగుతుందని స్థానిక నేతలు చెప్పడంతో అమరావతి నుంచే సమీక్షించాను. బాధిత కుటుంబాలను మంత్రులు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నేను ఉదయం నుంచి ఇతర కార్యక్రమాలు రద్దు చేసుకుని ఘటన అనంతర పరిస్థితులను పర్యవేక్షించాను' అని చంద్రబాబు పార్టీ శేణులకు పరిస్థితిని వివరించారు.

## ఆల్ ద బెస్ట్ దుర్గేష్

**రాష్ట్ర పర్యాటక మంత్రికి సీఎం శుభాకాంక్షలు**



అమరావతి (చైతన్య రథం): వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుని అవశేషాల ప్రదర్శన కార్యక్రమ నిర్వహణ బాధ్యతను కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు, మంత్రి కందుల దుర్గేష్‌కి అప్పగిస్తూ పీఎంవో ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సీఎం చంద్రబాబును మంత్రి దుర్గేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. దుర్గేష్ బుధవారం న్యూఢిల్లీకి బయలుదేరుతున్న క్రమంలో నిర్వహణ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ సీఎం చంద్రబాబు ఆల్ ది బెస్ట్ చెప్పారు. మే1 నుండి 6వరకు వియత్నాం పర్యటనలో ఉండనున్న మంత్రి దుర్గేష్.. అనంతరం న్యూఢిల్లీ మీదుగా విజయవాడకు చేరుకుంటారు.

## నెల్లూరు కారు ప్రమాదంపై సీఎం చంద్రబాబు విచారం

అమరావతి (చైతన్య రథం): నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం వద్ద ఇంట్లోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఆరుగురు మృత్యువాత పడటంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఐదుగురు వైద్య విద్యార్థులు అభిషేక్, జీవన్, నరేష్, యజ్ఞేష్, అభిసాయితోపాటు ఇట్లో ఉన్న వెంకటరమణయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## యువతకు నైపుణ్య పదును



- సాధికారత సాధనకు సర్కారు బాటలు
- యునిసెఫ్‌తో ప్రభుత్వం కీలక ఒప్పందం
- 2 లక్షలమందికి వ్యాపార నైపుణ్యాల పెంపే లక్ష్యం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూ

ఉండవల్లి (చైతన్య రథం): రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధితోపాటు సాధికారత కల్పించేందుకు యునిసెఫ్‌తో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఏపీ ప్రభుత్వం, యూనిసెఫ్ 3 ప్రధాన యువశక్తి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగింది. ఈమేరకు ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ, యునిసెఫ్ యువాహ్ ప్రతినిధులు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా యునిసెఫ్, ఏపీఎస్ఎస్ డీసీ పరస్పర సహకారంతో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్, యూత్ హబ్, పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఇంటికో వ్యాపారవేత్త, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ఇవి ఎంతగానో తోడ్పాటును అందించనున్నాయి. యువతలో నవీన ఆవిష్కరణలు, ఇంక్లూజన్, స్థిర జీవనోపాధి అవకాశాలను పెంపొందించనున్నాయి. యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ద్వారా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యసించే 2 లక్షలమంది యువతకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ఉద్యోగ సృష్టి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను అందించేందుకు యూనిసెఫ్ గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. యూత్ హబ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించిన బహుభాషా డిజిటల్ వేదిక ద్వారా యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, వాలంటీర్‌షిప్ అవకాశాలను కల్పిస్తారు. పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ కార్యక్రమం ద్వారా 15 నుంచి 29 ఏళ్ల మధ్యగల యువతకు ఉచితంగా అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్, ప్రొఫెషనల్ నైపుణ్య శిక్షణను అందిస్తారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో జి గణేష్‌కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె దినేష్ కుమార్, యునిసెఫ్ ఏపీ, కర్ణాటక, తెలంగాణ ఫీల్డ్ ఆఫీస్ సీఎఫ్‌వో జిలాలిమ్ బిర్హాను టఫెస్సే, ఫీల్డ్ ఆఫీస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీకృష్ణ మదమంచి, యూనిసెఫ్ ఇండియా అడాలసెంట్ అండ్ యూత్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ మానస ప్రియా వాసుదేవన్, స్టాక్ హెూల్మ్ డిజిటల్, ఏఐ, స్ట్రాటజీ, ఆఫీస్ ఆఫ్ ఇన్నోవేషన్ కన్సల్‌టెంట్ రవితేజ బాలే, ఏపీ కర్ణాటక, తెలంగాణ యునిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ ఇన్నోవేషన్ కన్సల్‌టెంట్స్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







# దేవినేని కుమారుడి వివాహ వేడుకలో మంత్రి లోకేష్

విజయవాడ (చైతన్య రథం): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. కృష్ణా జిల్లా కంకిపాడులోని ఆయానా కన్వెన్షన్‌లో జరిగిన వివాహ మహోత్సవ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి రాకను పురస్కరించుకుని మంత్రి లోకేష్, ఇతర టీడీపీ ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి మంత్రి నారా లోకేష్ నూతన వధూవరులు నిహార్, శ్రీసాయి నర్మదలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# రాజధాని రైతులను నమ్మించి ముంచిన జగన్



**ఐదేళ్లు రాజధానిలేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్**

**కూటమితో అమరావతికి పూర్వవైభవం**

**పునర్నిర్మాణ సభ విజయమే రాజధానికి మద్దతు**

**ప్రధాని సభ ఏర్పాట్లపై గొట్టిపాటి సమీక్ష**

తాడేపల్లి (చైతన్య రథం): ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా అమరావతి రాజధాని నిర్మాణం కోసం ముందుగా ఒక్క రూపాయి తీసుకోకుండా భూములిచ్చిన రైతులను జగన్‌మోహన్‌రెడ్డి నిండా ముంచాడని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మే 2న ప్రధాని ముఖ్య అతిథిగా జరిగే అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభను విజయవంతం చేయడానికి చేయాల్సిన ఏర్పాట్లపై విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో సహచర మంత్రులు అనగాని సత్యప్రసాద్, డోలా బాల వీరాంజనేయ స్వామి, కొలుసు పార్థసారథిలతో పాటు బాపట్ల ప్రాంతానికి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... రాజధాని అమరావతి ప్రాంతంలోనూ జగన్ మోహన్‌రెడ్డిని నమ్మి ఎంతోమంది రైతులు వైసీపీని గెలిపిస్తే... అధికారంలోకి వచ్చిన తరువాత.. ఓటేసిన అన్నదాతకు తీరని అన్యాయం చేశాడన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుమీద నమ్మకంతో వేల ఎకరాలు ఇచ్చిన రైతుల నమ్మకాన్ని జగన్ సర్వ నాశనం చేశాడన్నారు. మరోవైపు మూడు రాజధానులంటూ... కుటిల రాజకీయంతో రాష్ట్ర ప్రజలను జగన్ మాయ చేశాడని మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. చివరకు ఆంధ్రప్రదేశ్‌ని ఐదేళ్లు రాజధానిలేని రాష్ట్రంగా మార్చాడని పేర్కొన్నారు.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత... అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు, రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరలా రాజధాని పునర్నిర్మాణం ప్రారంభించినట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. మే 2న ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా పాల్గొనే అమరావతి నిర్మాణ పనుల పున:ప్రారంభ సభకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది తరలి వచ్చి మద్దతు ప్రకటించాలని పిలుపు నిచ్చారు. అదే విధంగా బాపట్ల ప్రాంతం నుంచి పెద్దఎత్తున పునర్నిర్మాణ సభకు ప్రజలు వచ్చే విధంగా కూటమి నేతలు ఏర్పాట్లు చేయాలని బాపట్ల ప్రాంత ఎమ్మెల్యేలను మంత్రి గొట్టిపాటి దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా సభకు వచ్చేవారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండాకాలం కావడంతో దూర ప్రాంతాలనుంచి వచ్చేవారికి మంచినీరు, మజ్జిగ, అల్పాహారంవంటి వాటికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. దీనికి సంబంధించి ప్రభుత్వం అన్నిరకాల ఏర్పాట్లు చేస్తుందని... వాటిని సమన్వయం చేసుకుని సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ పక్షనేతలు పాల్గొన్నారు.

# ప్రమాదం.. దురదృష్టకరం

- **సింహాచలం దుర్ఘటనపై దేవాదాయ మంత్రి ఆనం**
- **హుటాహుటిన ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది**
- **ఘటనా ప్రాంతంలో పరిస్థితిని మంత్రులు సమీక్షించారు**
- **బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది**



నెల్లూరు (చైతన్య రథం): సింహాచలం ఆలయంలో ప్రకృతి వైపరీత్యానికి భక్తులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం, బాధాకరమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సింహాచలం ఘటనపై బుధవారం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖపట్టణం జిల్లా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏటా నిర్వహించే విశిష్టమైన నిజరూప దర్శనానికి లక్షలాదిగా భక్తులు విచ్చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున గాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షం వలన సంభవించిన ప్రకృతి వైపరీత్యానికి స్వామివారి నిజరూప దర్శనానికి విచ్చేసిన ఏడుగురు భక్తులు మరణించగా, ఒకరు గాయపడినట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి అనితను రాష్ట్ర ప్రభుత్వం తరఫున హుటాహుటిన ఘటన జరిగిన స్థలానికి పంపి సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకు దర్శనాలు ప్రారంభం కాగా అదే సమయంలో భారీ ఈదురు గాలులతో భారీ వర్షం కురవడం వలన కొండలపై నుంచి భారీగా వర్షం నీరు చేరడంతో ప్రహరీ గోడ కింద ఉన్నటువంటి మట్టి అంతా కరిగి కొత్తగా కట్టినటువంటి ప్రహరీ గోడ పడిపోవడంతో ఘటన జరిగినట్లు మంత్రి చెప్పారు.

అనేక ఆలయాలకు కేంద్ర ప్రభుత్వం పర్యాటక రంగం నుంచి ప్రసాదం స్కీం కింద ఆలయాల అభివృద్ధి నిర్మాణ పనులు చేపడుతుందని, ఒకవైపు శ్రీశైలం, మరోవైపు కనకదుర్గమ్మ ఆలయం కొన్ని అభివృద్ధి పనులు ప్రసాదం స్కీం కింద పూర్తయ్యాయని, సింహాచలంలోనూ ఆలయ అభివృద్ధి పనులు ప్రసాదం స్కీం కింద ప్రారంభమైనట్లు చెప్పారు. అటు పర్యాటకరంగం, ఇటు దేవాదాయ శాఖ పర్యవేక్షణలో నిర్మాణ పనులు జరుగుతున్నట్టు చెప్పారు.

సింహాచలంలో జరిగే చందనోత్సవం ప్రభుత్వ పండుగగా గుర్తించడం జరిగిందని దేవాదాయ మంత్రిగా తాను, రెవిన్యూ శాఖ మంత్రి, హోంమంత్రి, అనువంశిక ధర్మకర్తగా అశోక్ గజపతిరాజు దాదాపు రెండు నెలలనుంచి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఘటన జరిగిన తదనంతరం సహాయక చర్యలు ముమ్మరం చేసి దూరప్రాంతాల నుంచి వచ్చినటువంటి భక్తులకు స్వామి వారి దర్శనం సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దర్శనాలన్నీ ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతున్నాయని, భక్తుల నుంచి కూడా ఏర్పాట్లపై మంచి స్పందన వస్తుందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు అన్ని సజావుగా సాగాయని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఒక్క దురదృష్ట ఘటన వినా అంతా సజావుగా సాగుతుందన్నారు.

ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర విచారం వ్యక్తం చేసిందని, సింహాచలం ప్రమాద ఘటనపై ఉన్నతాధికారులు, మంత్రులతో సిఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తగిన ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారని, జిల్లా అధికారులతో మాట్లాడి ఘటన జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయం వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. గోడ కూలిన ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు సీఎం ఆదేశించారని, విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చనిపోయిన ఒక్కొక్కరికి 25 లక్షలు, గాయాలు పాలైన వారికి మూడు లక్షల రూపాయలతో పాటు వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందన్నారు.

సింహాచల ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారని, మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున రెండు లక్షలు, గాయపడిన వారికి 50 వేలు పరిహారం ప్రకటించినట్టు మంత్రి చెప్పారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయ శాఖలో పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఆ కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

# మోదీ పర్యటనకు ట్రాఫిక్ ఆంక్షలు

మంగళగిరి(చైతన్యరథం): ప్రధాని మోదీ అమరావతి పనులకు శంకుస్థాపన కోసం మే 2న శుక్రవారం రానున్న పర్యటించనున్న దృష్ట్యా ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10:00 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అమరావతిలో మోదీ పర్యటన, బహిరంగ సభ సజావుగా సాగడానికి జాతీయ, రాష్ట్ర రహదారులపై ట్రాఫిక్ రద్దీని నివారించడానికి ప్రజల సౌకర్యం కోసం ట్రాఫిక్ మళ్లించారు.

- రేపు ఉదయం 5- 10 గంటల వరకు అమలు
- ఆయా మార్గాల్లో వాహనాల మళ్లింపు ఇలా..

### భారీ వాహనాలు, లారీల మళ్లింపులు

1. చెన్నై వైపు నుంచి విశాఖపట్నానికి వయా విజయవాడ మీదుగా, ఇబ్రహీం పట్నం, నందిగామ, వైపునకు వెళ్లే భారీ గూడ్స్ వాహనాలు ఒంగోలు జిల్లా త్రోవగుంట వద్ద నుంచి చీరాల–బాపట్ల– రేపల్లె– అవనిగడ్డ– పామర్రు– గుడివాడ హనుమాన్ జంక్ష న్ మీదుగా విశాఖపట్నం, ఇబ్రహీంపట్నం వైపునకు మళ్లించనున్నారు. అదేవిధంగా విశాఖపట్నం నుంచి చెన్నై వైపు ఇదే మార్గం గుండా వాహనాలు వెళ్లవలెను.
2. చిలకలూరిపేట వైపు నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలను చిలకలూరిపేట నుంచి ఎన్‌హెచ్–16 మీదుగా పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జ్ మీదుగా అవనిగడ్డ, పామర్రు గుడివాడ – హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించనున్నారు.
3. చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలను బోయపాలెం క్రాస్ వద్ద నుంచి ఉన్నవ గ్రామం, ఏ.బి.పాలెం, వల్లూరు, పాండ్రపాడు, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జ్ మీదుగా అవనిగడ్డ, పామర్రు –గుడివాడ– హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించనున్నారు.
4. గుంటూరు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను బుడంపాడు క్రాస్ మీదుగా తెనాలి – వేమూరు– కొల్లూరు – వెల్లటూరు జంక్షన్ – పెనుమూడి బ్రిడ్జ్ మీదు గా అవనిగడ్డ, పామర్రు – గుడివాడ – హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించనున్నారు.
5. గన్నవరం వైపు నుంచి హైదరాబాద్‌కు వయా ఆగిరిపల్లి – శోభనాపురం గణప వరం వెళ్లవలెను. మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మీదుగా
6. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వైపు: హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు – మైలవరం జి.కొండూరు–ఇబ్రహీంపట్నం వైపు భారీ గూడ్స్ వాహనాలు వెళ్ళవలెను. ( అదే విధంగా హైదరాబాద్ నుండి విశాఖపట్నం వైపు ఇదే మార్గం గుండా వెళ్లవలెను)

### మల్టీ-యాక్సిల్ గూడ్స్ వాహనాలకు ప్రత్యేక సూచనలు

చెన్నై నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే ఈ తరహా వాహనాలు చిలకలూరిపేట, ఒం గోలు, నెల్లూరు వద్ద జాతీయ రహదారి దగ్గర మళ్లింపు లేకుండా నిలిపివేయ నున్నారు. విశాఖపట్నం నుంచి చెన్నై వైపు వెళ్లే ఈ తరహా వాహనాలు హనుమాన్ జంక్షన్, పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారి దగ్గర నిలిపివేస్తారు. ఆగిన అన్ని మల్టీ–యాక్సిల్ వాహనాలు రాత్రి 9 గంటల తర్వాత ముందుకుసాగడానికి అనుమతిస్తారు. ఈ సమయంలో ట్రాఫిక్ సజావుగా సాగేలా ప్రయాణీకులు సహకరించాలని డీజీపీ ఒక ప్రకటనలో సూచించారు.

## సింహాచలం అప్పన్నకు టీటీడీ చైర్మన్ పట్టువస్త్రాలు



విశాఖపట్నం(చైతన్యరథం): ప్రముఖ పుణ్యక్షేత్రమైన విశాఖపట్నం సమీపంలోని సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి(అప్పన్న)కి టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు బుధవారం పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ 1996 నుంచి టీటీడీ తరఫున వరాహ లక్ష్మీనరసింహస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. దేశంలోని అన్ని నరసింహస్వామి క్షేత్రాల్లో సింహాచలం అతి ప్రాచీనమైనదని, స్వామివారు ఇక్కడ స్వయంభువుగా వెలిశారు. సింహగిరిపై కొలువైన సింహాద్రి అప్పన్న చందనోత్సవం వేకువజామున వైభవంగా ప్రారంభమైంది. సింహాచలం అప్పన్న విగ్రహం ఏడాది పొడవునా చందనంతో కప్పి ఉంటుంది. సంవత్సరంలో 12 గంటలు మాత్రమే చందనం పూత లేకుండా స్వామి వారు దర్శనమిస్తారు. పవిత్రమైన అక్షయ తృతీయ రోజున స్వామివారి విగ్రహానికి చందనం పూత తొలగించి తిరిగి పూస్తారు. చందన యాత్ర లేదా చందనోత్సవం పేరిట ప్రతి ఏటా వైశాఖమాసంలో ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి వారి తరఫున టీటీడీ చైర్మన్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, బొక్కసం ఇన్‌చార్జ్ గురురాజ్ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దుర్ఘటనపై శవరాజకీయాలా?

- వైసీపీ నేత జగన్‌పై మంత్రి అచ్చెన్న ఫైర్
- జగన్ హయాంలో ఎంత పరిహారం ఇచ్చారు..
- సమాధానం చెప్పాలంటూ మంత్రి డిమాండ్



అమరావతి (చైతన్య రథం): సింహాద్రి అప్పన్నస్వామి చందనోత్సవ ఘట్టంలో ప్రకృతి ప్రతికూలించి ప్రమాదం చోటు చేసుకుంటే.. శవరాజకీయాలకు తెరలేప డం వైసీపీ దుష్ట రాజకీయానికి పరాకాష్ట అని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షం కార ణంగా గోడ బలహీనపడి మీదపడటంతో భక్తులకు ప్రమాదం సంభవించిందన్న కించిత్ బాధ లేకుండా... పొలిటికల్ మైలేజ్ కోసం జగన్ పాకులాడటం దుర దృష్టకరం, బాధాకర చర్యగా అభివర్ణించా రు. సంఘటన చోటుచేసుకున్న మరు క్షణం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంత వేగంగా స్పందించారు, ఎలాంటి చర్యలు తీసుకున్నారో రాష్ట్రం మొత్తం చూస్తోందని అంటూ.. జగన్‌కు మాత్రం దుర్మార్గ రాజ కీయమే కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రమాదం సంభవించిన క్షణాల్లోనే బాధితు లను మెరుగైన ఆస్పత్రులకు తరలించా రని, క్యూలైన్లను క్రమబద్ధీకరించి భక్తుల ఇబ్బందులు నివారించారన్నారు. రెస్క్యూ సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, మంత్రులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై పూర్తి విచారణకు ముగ్గురు సభ్యుల కమిటీని ప్రభుత్వం నియమించింది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడినవారికి రూ.3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. అలాగే, దేవాదాయ శాఖ పరిధిలో ఆయా కుటుంబ సభ్యులకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించాలని ఆదేశించ బడింది. జగన్ పాలనా హయాంలో రాష్ట్రాన్ని విధ్వంసం చేయడం తప్ప, బాధితులను ఆదుకున్న ఒక్క ఉదంతమైనా చెప్పాలని అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించినపుడు ఏరోజూ తాడేపల్లి కొంపనుంచి అడుగు బయటకుపెట్టని జగన్.. కూటమి సర్కారుపై బురదజల్లే రాజకీయానికి తెగబడటం అనైతిక రాజకీయాలను బయటపెట్టుకోవడమేనని ఎద్దేవా చేశారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే ప్రభుత్వాన్ని, పోలీసులను దూషించడం జగన్‌కు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.

'జగన్‌రెడ్డి హయాంలో జరిగిన ప్రమాదాల్లో బాధితుల పరామర్శకు వెళ్లాడా? తిరుపతి రుయా ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 112మంది మరణించి నప్పుడు ఎందుకు పరామర్శించలేదు? వారికి ఎలాంటి పరిహారం అందించాడు? జంగారెడ్డిగూడెం కల్తీ మద్యం ఘటనలో 27మంది చనిపోయినప్పుడు జగన్ ఎందుకు స్పందించలేదు? విశాఖపట్నం హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో క్రెయిన్ కూలిన ఘటనలో 11మంది మరణించినప్పుడు జగన్‌కు కనిపించలేదా? అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయినప్పుడు జగన్ ఎక్కడున్నాడు? కచ్చలూరు బోటు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు చివరి చూపు కూడా దక్కకుండా చేసిన జగన్‌రెడ్డి అసమర్థతను ఎవరు మరచిపోగలరు? విశాఖ ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజ్ ఘటనలో కంపెనీ ఇచ్చిన పరిహారాన్ని తానిచ్చినట్టు గొప్పలు చెప్పుకున్న జగన్‌ను చూసి ప్రజలు ఛీత్కరించుకుంటున్నారు. విజయవాడ వరద బాధితులకు కోటి రూపాయల పరిహారం ఇస్తానని చెప్పిన జగన్, ఆ మాట ఎక్కడ నెరవేర్చాడని అచ్చెన్న నిలదీశారు. జగన్ రెడ్డి నీచ రాజకీయాలు చూసి ప్రజలు విసిగిపోయారు. ఇకనైనా మానవీయంగా ఆలోచిస్తేనే జగన్‌కు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హితవు పలికారు.

## త్వరలో ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ

- ఆర్యవైశ్యుల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం
- బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యమని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశా రు. బుధవారం సచివాలయంలో మంత్రి సవితను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేశ్ సహా పలువురు డైరెక్టర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్యవైశ్యుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. 2018–19లో ఆర్యవైశ్యుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.30 కోట్ల మేర నిధులు కేటాయించారన్నారు. 2024–25, 2025–26 బడ్జెట్‌లో ఆర్యవైశ్యులకు భారీగా నిధులు కేటాయించినట్లు వివరించారు. ఆర్యవైశ్యుల్లోని పేదలకు ఆర్థిక భరోసా కల్పించడానికి సహకార



క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయాలని ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎం ఆదేశాల మేరకు త్వరలో ఏపీ ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. దాని ద్వారా ఆర్యవైశ్యులకు రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎస్ ఎంఈలో భాగంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటులో ఆర్యవైశ్యులకు పెద్దపీట వేయబోతున్నామన్నారు.

ఆర్యవైశ్యుల కార్పొరేషన్ సభ్యులు తెలిపిన సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు. అంతకుముందు ఆర్యవైశ్య కార్పొరేషన్ పాలక మండలి తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేశ్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# తీవ్ర ఆవేదనకు గురిచేసింది: నారా లోకేష్

సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద జరిగిన దుర్ఘటన తీవ్ర ఆవేదన కు గురిచేసింది. ఈ ఘటనలో గాయపడిన వారికి విశాఖ కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స జరుగుతోంది. బాధితులకు మెరుగైన చికిత్స కోసం అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సిందిగా యంత్రాంగాన్ని ఆదేశించాం. పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయి. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది.





**సింహాచలం దుర్ఘటన దురదృష్టకరం: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్**

సింహాచలంలో గోడ కూలడం మూలంగా క్యూలైన్‌లో ఉన్న ఎనిమిది మంది భక్తు లు మృతిచెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాను. చందనోత్సవ సమయాన ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సాను భూతి తెలియజేస్తున్నా. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. విశాఖపట్నం జిల్లా అధికారుల నుంచి ఈ ఘటన వివరాలు తెలుసుకున్నాను. భారీవర్షాల మూలంగా గోడ కూలిందని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించాను.

**విచారణకు ఆదేశించాం: దేవాదాయ మంత్రి ఆనం**

సింహాచలం ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశా లు జారీ చేశాం. జరిగిన దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాను. మృతులకు టుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ ఘటనపై విచారణకు ఆదేశి చాం. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలయ ప్రాంతంలో రక్షణ చర్యలు తీసుకుంటాం.

**ఘటన దురదృష్టకరం: మంత్రి పొంగూరు నారాయణ**

సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో గోడ కూలి భక్తులు మృతిచెందిన ఘటనపై మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దైవ దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు మృతిచెంద డం దురదృష్టకరం. మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

**బాధితులకు ప్రభుత్వం అండ: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**

సింహాచలంలో గోడ కూలి మృతిచెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సాను భూతి తెలియజేస్తున్నా. భారీవర్షాలు, ఈదురుగాలులతో గోడ కూలి భక్తులు చనిపోవ డం దురదృష్టకరం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసహాయం అందిస్తున్నాం.

**మనోవేదనకు గురిచేసింది: మంత్రి అచ్చెన్నాయుడు**

స్వామి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడం తీవ్ర మనోవేదనకు గురిచేసింది. ప్రమాద ఘటనపై జిల్లా అధికారులతో మాట్లాడాను. మృతు ల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించాం.

**అకాల వర్షంతో ఘటన: మంత్రి డోలా**

సింహాచలం ఘటన కలచివేసింది. గోడ కూలి 7 మంది భక్తులు మృతిచెందడం బాధాకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. అధికారులు నెలరోజులు శ్రమించి భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా సౌకర్యాలు కల్పించినా అకాల వర్షానికి ఈ ఘటన జరగడం దుర దృష్టకరం. ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుంది.

**క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి: మంత్రి కందుల దుర్గేష్**

సింహాచలం లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవంలో అపశ్రుతి జరగడం కలచి వేసింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. బాధిత కుటుంబాలను ప్రభు త్వం ఆదుకుంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం.. త్వరగా కోలు కుంటారని ఆశిస్తున్నాం. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# రాష్ట్రవ్యాప్తంగా 70 వేల వ్యవసాయ కనెక్షన్లు

- భవిష్యత్తులో మరో 50 వేలు అందించేందుకు ప్రణాళిక
- అద్దంకిలో రెండు సబ్ స్టేషన్లకు భూమి పూజ చేసిన మంత్రి
- 12 ఏళ్ల తరువాత అద్దంకికి శాశ్వత అగ్నిమాపక కేంద్రం



అద్దంకి (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 70 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. భవిష్యత్తులో మరో 50 వేల వ్యవసాయ కనెక్షన్లు అందించేందుకు ఇంధన శాఖ సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. అద్దంకి నియోజకవర్గంలో బుధవారం మంత్రి గొట్టిపాటి పర్యటించారు. అద్దంకి నియోజకవర్గంలో మరో రెండు సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు రూ.11 కోట్లతో నిర్మించనున్న రెండు సబ్ స్టేషన్లకు భూమి పూజ నిర్వహించామన్నారు. ప్రజా వినియోగానికి తగినట్లు నాణ్యమైన విద్యుత్‌ను అందించే దిశగా రెండు సబ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకుని రానున్నట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా ఇప్పటి వరకు అద్దంకిలో 1700 కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలను మార్చినట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు. రానున్న రోజుల్లో మరో 500 కొత్త విద్యుత్ స్తంభాలను అందుబాటులోకి తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ సంస్కరణలను అమలు చేయలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామన్నారు. అనాలోచిత నిర్ణయాలతో జగన్‌రెడ్డి ప్రతి వ్యవస్థనూ భ్రష్టుపట్టించినట్లు మంత్రి గొట్టిపాటి దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబుమీద నమ్మకంతో, ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని నిర్మించేందుకు భూములు ఇచ్చిన రైతులను కూడా జగన్ ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. అమరావతి పూర్తయితే తెలుగుదేశంపార్టీకి, చంద్రబాబు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే దుర్మార్గపు ఆలోచనతో మూడు రాజధానుల పేరుతో జగన్ నాటకం ఆడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాలు ఏ ప్రభుత్వం తీసుకొచ్చినా.. తరువాత వచ్చే ప్రభుత్వాలు వాటిని కొనసాగించాలన్నారు. నాడు సీనియర్ ఎన్టీఆర్ ప్రారంభించిన రూ.2 లకే కిలో బియ్యం ప్రభుత్వాలు మారినా ఇప్పటికీ అలానే కొనసాగుతుందని చెప్పారు. ఏపీ ప్రజల జీవనాడి పోలవరాన్ని కూడా రివర్స్ టెండరింగ్ పేరుతో నాశనం చేసిన వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అని మంత్రి గొట్టిపాటి విమర్శించారు.

**శాశ్వత అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన**

అద్దంకిలో శాశ్వత అగ్నిమాపక కేంద్రానికి రాష్ట్ర ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు శాశ్వత అగ్నిమాపక భవనం లేక స్థానికంగా ఉండే వ్యవసాయ మార్కెట్ యార్డులో అగ్నిమాపక సిబ్బంది తమ కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. దీనిని గమనించిన మంత్రి గొట్టిపాటి... శాశ్వత భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి పూర్తి అనుమతులతో స్థానికంగా శింగరకొండ వద్ద అగ్నిమాపక భవనానికి బుధవారం శంకుస్థాపన చేశారు.

**ప్రధాని మోదీ సభ విజయవంతం చేయండి**

అద్దంకిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... మే 2న జరగనున్న అమరావతి పునర్నిర్మాణ సమావేశానికి అద్దంకి నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని గొట్టిపాటి పిలుపునిచ్చారు. సభకు వచ్చే ప్రజల కోసం రవాణా, భోజన ఏర్పాట్లను ప్రభుత్వం చేపడుతుందన్నారు. వేసవి కాలం కాబట్టి సభకు వచ్చే వారికి మంచినీరు ప్యాకెట్లను అందించడంతోపాటు మజ్జిగ ప్యాకెట్లు కూడా అందించేలా స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి కోరారు.

# చంద్రబాబు బాధ్యతతో వ్యవహరించారు

- తక్షణమే వైద్యం, ఆర్థికసాయం
- సింహాచలం ఘటన దురదృష్టకరం
- వైసీపీ నికృష్ట రాజకీయాలు హేయం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం(చైతన్యరథం): సింహాచలం ఆలయ పరిసరాల్లో గోడ కూలిన ఘట నపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందించారు. ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎనిమిది మంది భక్తులు ప్రాణాలు కోల్పో వడం తీవ్ర విషాదకరం. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి బాధ్యతతో వెంటనే స్పందించారని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల



ఎక్స్‌గ్రేషియా ప్రకటించి గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అంది స్తున్నట్లు వివరించారు. ఈ ప్రమాదానికి కారణమైన నిర్మాణ లోపాలపై తక్షణమే విచారణకు ఆదేశిం చారని తెలిపారు. ఎవరు బాధ్యులైనా కఠిన చర్యలు తప్పవు. భవిష్యత్తు లో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవస్థానాల్లో భద్రతా సమీక్ష చేపడతా మని తెలిపారు. ప్రకృతి విపత్తుల వంటి విషాద ఘటనలను కూడా రాజకీయం చేయడం వైసీపీకి అలవాటేనని, బాధిత కుటుంబాల బాధను రాజకీయ లబ్ధికోసం వాడటం శోచనీయమని విమర్శించారు. విషాదాన్ని కూడా ప్రభుత్వంపై దుష్ప్రచారానికి వేదికగా మార్చే వైఖరిని ప్రజలు ఎప్పటికీ క్షమించరు. వారి రాజకీయం ఎంతస్థాయి దిగజారిందో వారి తీరే నిదర్శనమని హితవుపలికారు.

# గడువులోగా పోలవరం ఎడమ కాలువ పనులు

- బుడమేరుకు సమాంతరంగా మరొక కొత్త ఛానెల్
- బుడమేరు డైవర్షన్ కెనాల్‌కు డీపీఆర్ సిద్ధం చేయాలి
- అధికారులకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం



అమరావతి(చైతన్యరథం): అమరావతి సచివాలయంలో బుడమేరు ఆధునికీకరణ, పోలవరం ఎడమ కాలువ పనులపై ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల రామా నాయుడు బుధవారం సమీక్షించారు. ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈలు, ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నా రు. బుడమేరు మూడు గండ్ల మరమ్మతుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తవ్వడంతో పనులు వెంటనే మొదలు పెట్టి సీజన్ మొదలయ్యేలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. బుడమేరు వరద ఎనికేపాడు మీదుగా కొల్లేరు, ఉప్పుటేరు నుంచి సముద్రంలో కలిసేలా డీపీఆర్ తయారు చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. బుడమేరు ఓల్డ్ ఛానెల్‌కు సమాంతరంగా మరొక కొత్త ఛానెల్‌ను కూడా 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద కేంద్రం సహకారంతో ముందుకు వెళ్లేలా ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌ంట్ శాఖలు సమన్వయంతో ప్రతిపాదనను ముఖ్యమంత్రి ముందు ఉంచుతామని తెలిపారు.

పోలవరం ఎడమ కాలువ పనులు జూన్‌లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలో ఏజెన్సీలు సరిపడా మ్యాన్ పవర్, మెషినరీ, బ్యాచింగ్ ప్లాంట్లు, టిప్పర్లు, రోలర్లు, ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేయకపోవడంపై మంత్రి నిమ్మల అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువులోగా పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి గోదావరి జలాలు తరలించాలని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

# తక్షణమే నల్ల బర్లీ పొగాకు కొనుగోలు

- నాణ్యత లోపం సాకుతో తిరస్కరిస్తే కఠిన చర్యలు
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం



గుంటూరు(చైతన్యరథం): పొగాకు వ్యాపారులు తక్షణమే నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. నాణ్య త లోపం సాకుతో తిరస్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం గుంటూరు లామ్ వద్ద ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెం నాయుడు అధ్యక్షతన నల్ల బర్లీ పొగాకు కొనుగోలుపై రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పొగాకు వ్యాపారులు, రాష్ట్ర వ్యవసాయ ఉన్నతాధికా రులు, పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు.

గత కొన్ని రోజులుగా పొగాకు వ్యాపారులు, నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయకుండా తాత్సా రం చేస్తూ రైతులను తీవ్ర ఇబ్బందుకు గురి చేస్తున్నారని..ఈ అంశం చాలా ఆందోళన కలిగించిందని తెలిపారు. ముఖ్యమంత్రి నల్ల బర్లీ పొగాకును వ్యాపారులు ఎటువంటి నాణ్యతా ప్రమాణాల షరతులు విధించకుండా తక్షణమే కొనుగోలు చేయాలని ఆదేశిం చినట్లు తెలిపారు. 30 శాతం సాగులో ఉన్న బర్లీ పొగాకును కూడా కొనుగోలు చేయా ల్సిన అవసరం ఉందని సూచించారు. దీనిపై పొగాకు వ్యాపారులు స్పందిస్తూ రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే ఒక పది శాతం మేర కొనుగోలు ప్రక్రియ మొదలైందని, ఇకనుంచి మరింత పుంజుకుని 100 శాతం బర్లీ పొగాకును కొనుగోలు చేస్తామని సమాధానమిచ్చారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ గురువారం నుంచి పొగాకు బోర్డు కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ప్రారంభించి, మరింత ప్రచారం చేయా లని, పొగాకు వ్యాపారులు, కంపెనీలు తప్పనిసరిగా కొనుగోలు ప్రక్రియలో పాల్గొనేలా చేయాలని, కంపెనీల వారీగా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని, నాణ్యత ప్రమా ణాలు లేవనే అంశంతో తిరస్కరణ చేయరాదని వ్యవసాయ సంచాలకులు డిల్లీరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ, రైతు నాయకులు జములయ్య, కృష్ణయ్య, హరిబాబు, రైతులు, పొగాకు కంపెనీలు, వ్యాపా రులు పాల్గొన్నారు.

# మోదీ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

పాల్గొన్న మంత్రి నారాయణ, అధికారులు



అమరావతి(చైతన్యరథం): ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. బుధవారం ఏర్పాట్లను మంత్రి నారాయణ పరిశీలించారు. రవాణా, పార్కింగ్ ఎంతో కీలకమని.. వర్షం వస్తే పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయం చూడాలని సీఎం సూచన మేరకు పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చామని వివరించారు. 3000 బస్సులు, 1000 కార్లకు పార్కింగ్ ఏర్పాట్లు ముందుగానే చేశామని, 5 లక్షల పైగా జనాభా వచ్చే అవకాశం ఉండటంతో పార్కింగ్‌కు మరిన్ని ప్రాంతాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 6500 -7000 బస్సులు, 3000 కార్లకు పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రోటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానమేనని వివరించారు. అన్ని శాఖలు సమ న్వయంతో ముందుకువెళున్నాయని తెలిపారు.

# వీలైనంత త్వరగా చేనేత సహకార ఎన్నికలు

- ప్రభుత్వ ఆర్డర్లు సేకరించి క్లాత్ సరఫరా చేయాలి
- చేనేత బజార్లలో విస్తృతంగా వస్త్ర విక్రయాలు
- చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశం



అమరావతి(చైతన్యరథం): చేనేత సహకార సంఘాల ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఇటీవల చేనేత జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ఆర్పీ సిసోడియా బుధవారం మర్యాపూర్వకంగా సచివాలయంలో మంత్రి సవితను కలిశారు.

ఈ సందర్భంగా చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. మంత్రి సవిత మాట్లాడుతూ చేనేతలకు 365 రోజుల పాటు పని కల్పించడంతో పాటు ఆత్మగౌరవంతో జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. ఇందుకు అనుగుణంగా పలు పథకాలు రూపొందించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనంత ఎక్కువ ప్రాజెక్టులు, నిధులు రాబట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఆప్కో ద్వారా విక్రయాలు పెంచండి**

ఆప్కోలో ప్రక్షాళన చేపట్టాలని, చేనేత వస్త్ర విక్రయాలు పెరిగేలా చేనేత బజార్లు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలకు ఆర్డర్ల మేరకు త్వరితగతిన ఆప్కో ద్వారా క్లాత్ సరఫరా చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సాంఘిక, గిరిజన సంక్షేమ హాస్టళ్లకు దుప్పట్లు, టవళ్లు, ఇతర అవసరాలకు అవసరమయ్యే క్లాత్‌ను అందజేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన క్లాత్‌కు సంబంధించి ఆర్డర్లు సేకరించి ఆప్కో ద్వారా సప్లయ్ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంతో పాటు జాతీయస్థాయిలో పెద్ద పెద్ద నగరాల్లో చేనేత బజార్లు నిర్వహించాలని, రాష్ట్రంలో క్లస్టర్ల ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. చేనేత సహకార సంఘాల ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించేందుకు సిద్ధమవ్వాలన్నారు. ఇందుకు కోసం సొసైటీ బలోపేతంపై దృష్టి పెట్టాలన్నారు.

**హస్త కళాకారులకు నైపుణ్య శిక్షణ ఇప్పించండి**

రాష్ట్రంలో హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం పీట వేస్తోందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా లేపాక్షిని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని తెలిపారు. కస్టమర్లను ఆకట్టు కునేలా హస్త కళారూపాల తయారీకి కళాకారులను అవసరమైన నైపుణ్య శిక్షణ అందజేయాలన్నారు. ముఖ్యంగా వెదురు, అరటి ఫైబర్‌తో తయ్యారయ్యే కళారూపాలను నేటి అభి రుచులకు అనుగుణంగా రూపొందించేలా చూడాలని ఆదేశించారు.

# మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా నోటిఫికేషన్ విడుదల

- 421 ఉద్యోగాల భర్తీకి మే 2 నుంచి దరఖాస్తులు
- రాత పరీక్ష లేదు.. సీనియర్ క్రీడా మెరిట్‌తో ఎంపిక
- రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి



అమరావతి(చైతన్యరథం): ఏపీ ప్రభుత్వం క్రీడాప్రాధికార సంస్థ మెగా డీఎస్సీ-2025లో భాగంగా 3 శాతం క్రీడల కోటా ఉద్యోగాల భర్తీకి బుధవారం విజయవాడ శాప్ ప్రధాన కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభకు న్యాయమైన గుర్తింపు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ముఖ్యమైనదన్నారు. క్రీడలతో యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారు. ఇది సమర్థ సమాజ నిర్మాణానికి మూలస్తంభం. ఈ విషయాన్ని ముందు గానే గుర్తించి రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి దిశా నిర్దేశం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. మెగా డీఎస్సీలో విడుదల చేసిన 16,347 పోస్టుల్లో క్రీడా కోటా కింద 421 పోస్టులను స్పోర్ట్స్ కోటా కింద కేటాయించినట్లు తెలిపారు. స్పోర్ట్స్ కోటాకు ఎంపికను పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నిష్పక్షపాతంగా అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడాకారులను కనీసం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత క్రీడా కారులకు 3 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. అలాగే ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఇన్సెంటివ్‌లు అందిస్తామని తెలిపారు. ఫేక్ సర్టిఫికెట్లపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. మెగా డీఎస్సీకి అర్హులైన క్రీడాకారులు మే 2నుంచి మే 31వరకు https://sports.ap.gov.in, https:// sportsdsc. apcfss.in వెబ్‌సైట్లలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మెగా డీఎస్సీలో క్రీడా కోటా కింద ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో 333 పోస్టులు, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో 30 పోస్టులు, ఏపీ ట్రైబల్ వెల్ ఫేర్ ఆశ్రమ్ పాఠ శాలల్లో 22 పోస్టులు, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2 పోస్టులు, ఏపీ మోడల్ పాఠ శాలల్లో 4 పోస్టులు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 7 పోస్టులు, ఏపీ గురుకుల వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 23 పోస్టులు కేటాయించినట్లు వివరించా రు. ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ గిరీష, శాప్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యానాంలో జిప్‌మర్ సూపర్‌స్పెషాలిటీకి సాయం



- రాష్ట్ర ప్రభుత్వ వైద్యులు, తెలుగు ప్రజలకు మేలు
- వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ అంగీకారం

అమరావతి(చైతన్యరథం): యానాంలో జిప్‌మెర్ సూపర్ స్పెషాలిటీ సేవలు అం దించడానికి అవసరమైన సాయాన్ని సమకూర్చటానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ అంగీకరించారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి (పాండిచ్చేరి)లో భాగమైన యానాంలో ప్రఖ్యాత జిప్‌మర్(జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యు యేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) నిర్మించిన 100 పడకల సూపర్‌స్పెషాలిటీ సెంటర్ ద్వారా ప్రజలకు సేవలందించడానికి రాష్ట్ర ప్రభుత్వ సాయాన్ని కోరింది. ఈ విషయంపై యానాం మాజీ ఎమ్మెల్యే, పుదుచ్చేరి మాజీ ఆరోగ్య మంత్రి మల్లాడి కృష్ణారావు, పుదుచ్చేరిలోని జిప్‌మెర్ డైరెక్టర్ వి.యస్.నేగి, ఉన్నతాధికారులు బుధవారం మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ.సిరి, డీఎంఈ నరసింహం ఇతర ఉన్నతాధికారులతో ఏపీ సచివాలయంలో చర్చించారు. యానాంలో జిప్‌మర్ సెంటర్ నిర్మాణం పూర్తయిం దని, వివిధ మల్టీ స్పెషాలిటీ విభాగాల్లో సేవలందించడానికి అవసరమైన సిబ్బందిని సమకూర్చాలని కృష్ణారావు కోరారు. యానాం జనాభా 80 వేలు మాత్రమే అయినప్ప టికీ ఆనుకుని ఉన్న ఏపీ జిల్లాల నుంచి భారీస్థాయిలో పలు అవసరాల కోసం ప్రతిరోజూ యానాంకు వస్తారని, జిప్‌మర్ కేంద్రం సేవలు తెలుగు ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తాయని, సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రూ.91 కోట్ల ఖర్చుతో యానాంలో నెలకొల్పిన జిప్‌మెర్ సూపర్ స్పెషాలిటీ కేం ద్రం అందించనున్న సేవలు, తద్వారా ప్రజలకు ఒనగూరే మేలు, ఈ కేంద్రాన్ని నడ పటానికి అవసరమైన డాక్టర్లు, నర్సులు, పారా టెక్నికల్ సిబ్బంది వివరాలను డైరెక్టర్ నేగి వివరించారు. ఈ కేంద్రం ద్వారా అందించే సేవలు పొందే వారిలో 75 శాతం మంది చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తారని, ఈ కేంద్రాన్ని నడపడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎంతో ప్రయో జనం ఉంటుందని చెప్పారు. ప్రసూతి సేవలు, పిల్లల వైద్యం, మత్తు వైద్యం, శస్త్ర చికిత్స వంటి వివిధ సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో నిపుణులైన వైద్యులు, నర్సులను ఏపీ ప్రభుత్వం డెప్యుటేషన్‌పై నియమించాలని కోరారు. సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాం(డీఆర్‌పీ) కింద పీజీ విద్యార్థులను యానాం కేంద్రంలో నియమించాలని కోరా రు. వారికి తగు వసతి సదుపాయాలతో పాటు, డెప్యుటేషన్ అలవెన్స్‌తో కూడిన జీతభ త్యాలను పుదుచ్చేరి ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం కింద యానాం కేంద్రాన్ని నెట్‌వర్క్ ఆసుపత్రిగా గుర్తించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిం చే సాయానికి బదులుగా ప్రభుత్వ వైద్యులను లెప్రోస్కోపీ, అయవ మార్పిడి చికిత్సలు, రోబోటిక్ సర్జరీల వంటి విభాగాల్లో పుదుచ్చేరిలోని యానాంలోని జిప్‌మర్‌లో శిక్షణ ఇస్తామని వివరించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జిప్‌మర్ శిక్షణ వల్ల ఆంధ్రప్రదేశ్ వైద్యులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. జిప్‌మెర్ యానాం కేంద్రం ద్వారా చుట్టుపక్కల ఉన్న తెలుగు ప్రజలకు కలిగే ప్రయోజనాలతో పాటు ప్రఖ్యాత జిప్‌మర్‌లో రాష్ట్ర ప్రభుత్వ వైద్యులకు లభించే ఆధునిక శిక్షణ, సీనియర్ రెసిడెన్సీ, డీఆర్‌పీ ప్రోగ్రాం కింద రాష్ట్ర వైద్య విద్యార్థులకు జిప్‌మర్ సర్టిఫికెట్ ద్వారా ఒనగూరే ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని తగు సాయాన్ని అందిం చడానికి మంత్రి అంగీకరించారు. ఈ మేరకు నిర్దిష్ట ప్రతిపాదనలు అందజేయాలని మంత్రి సూచించారు.

## సింహాచలం ఘటనపై సీఎం వేగంగా స్పందించారు



- 72 గంటల్లో ప్రాథమిక నివేదికకు ఆదేశించారు
- బాధ్యులపై చర్యలకు విచారణ కమిషన్ ఏర్పాటు
- మృతులకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.3 లక్షలు
- బాధిత కుటుంబాలకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు
- గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి(చైతన్యరథం): సింహాచలంలో భక్తులపై గోడ కూలిన దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి తక్షణ సహాయక చర్యలు తీసుకునే విధం గా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం జరిగిందని సమాచార పౌర సంబంధా లు, గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన నివేదికను 72 గంటల్లో అందజేయాలంటూ ముగ్గురు ఉన్నతస్థాయి అధికారులతో విచార ణ కమిషన్‌ను నియమించడం జరిగిందన్నారు. మృతులకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.3 లక్షల నష్టపరిహారాన్ని ముఖ్యమంత్రి ప్రకటించినట్లు తెలిపారు. బాధిత కుటుం బాలకు చెందిన వారికి అవుట్ సోర్సింగ్‌పై ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశించార న్నారు. బుధవారం సచివాలయం ప్రచార విభాగంలో మీడియాతో ఆయన వివరాలు వెల్లడించారు. చందనోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పా ట్లను పటిష్ఠంగా చేయడం జరిగిందన్నారు. అకాల వర్షం కారణంగా క్యూలైన్ల కోసం నిర్మించిన గోడ నాని భక్తులపై పడటం ఈ దుర్ఘటనకు దారితీసిందన్నారు. ఈ దుర్ఘట నకు బాధ్యులైన వారికి తక్షణ చర్యలు తీసుకునేందుకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్‌గా ఐజీ ఎ.రవి కృష్ణ, జలవనరుల శాఖ అడ్వైజర్, ఇంజనీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు సభ్యులుగా విచారణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ కూడా స్పందిస్తూ విచారణ వ్యక్తం చేయడమే కాకుండా మృతులకు రూ.2 లక్షలు, గాయ పడిన వారికి రూ.50 వేలు ప్రకటించడం జరిగిందన్నారు. ఊహించని విధంగా జరిగిన ఈ ఘటనను రాజకీయం చేస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులు మాట్లాడటం దురదృష్టకమని విచారణ వ్యక్తం చేశారు.

**అమరావతికి అందరూ ఆహ్వానితులే...**

అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని, అమరావతి రాష్ట్ర ఆర్థిక గ్రోత్ ఇంజన్ అని, అటువంటి రాజధానిని ప్రేమించే వారంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. మే 2న సాయంత్రం 3.00 గంటల నుంచి మొదలయ్యే మోదీ పర్యటనను విజయవంతానికి పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. దాదాపు ఐదు లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని, ఎటువంటి అసౌకర్యం కలు గకుండా అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

# కీర్తిపతాక అమరావతి

ఖండాంతర ప్రయాణాలు సుఖవంతమైన ఈ రోజుల్లో తూర్పు దేశాల్లో ముఖ్యంగా ఆసియా దేశాల్లో అన్నింటికన్నా బహుళ ప్రాచుర్యం పొందిన బౌద్ధమతాన్ని, భారతీయ ఆధ్యాత్మికతను గురించి పాశ్చాత్యుల్లో ఇంకా ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. దీనివల్ల తూర్పు– పశ్చిమల మధ్య పరస్పర అవగాహన పెంపొందించి కడకు ప్రపంచంలోనే శాశ్వతమైన సుఖశాంతుల్ని నెలకొల్పాల్సిన తరుణమిది. అమరావతి నగర నిర్మాణం ఈ అవశ్యకతను మనకు గుర్తుచేస్తుంది.

నేడు నవ్యాంధ్ర రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటున్న శుభతరుణమిది. రెండు వేల సంవత్సరాల చరిత్రకు సాంస్కృతిక వారసత్వ సంపదగా నిలిచిన ప్రాచీన పట్టణం. అందుకే అంటారు మన అమరావతిని 'ది సిటీ దట్ లివ్స్ ఫర్ ఎవర్' అని. చరిత్రకారుల సార్ధక నామధేయం, భారతావని కీర్తి పతాక, అమరావతికి ఎంతటి చారిత్రక ప్రాముఖ్యత ఉందో, ప్రపంచ వాణిజ్య, వర్తక కేంద్రంగా కూడా ప్రాచీనకాలంలో అంతే ప్రాధాన్యతను సంతరించుకుంది. అందుకే కావాలి ఈ రోజు మన రాష్ట్ర ప్రజలకు అమరావతి ఆర్థిక ఆయువు పట్టు. అష్టైశ్వర్యాలకు ఆనవాలుగా నిలవాలి.

ఈ పురాతన పట్టణానికి నలుదిశలా నాలుగు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు వెలసి ఉన్నాయి. కృష్ణానదికి ఆవలి ఒడ్డున కామితమ్ములిచ్చు 'శ్రీకనకదుర్గమ్మ' తల్లి (ఇంద్రకీలాద్రిపై), ఇంకొక దిక్కున యోగాశీనులు అయిన 'శ్రీలక్ష్మీనారసింహుడు' (వేదాద్రిపై), ఇవతలి ఒడ్డున కొలువై ఉన్నాడు. 'శ్రీ పానకాల రాయుడు' (మంగళగిరిపై), దగ్గర్లోనే శ్రీ చెన్నకేశవుడి జతలో మధ్యలో నెలవైయున్నాడు. 'శ్రీ అమరలింగేశ్వరుడు' అమరావతి పట్టణాన్ని అలరిస్తూ అమరులు కొలువైన 'దివ్యక్షేత్రము'!

దేశంలోనే మొట్టమొదటిసారిగా బుద్ధుని ఉపదేశాలను పాటించి ఆచరించిన ఘనత తెలుగువారిదే. అమరావతిలోనే 'కాలచక్ర' (వీల్ ఆఫ్ టైం) సందేశాన్ని మానవాళికి గౌతముడు ప్రబోధించినట్లు టిబెటన్ల నమ్మకం. అందుకే కాబోలు తిరిగి ఇక్కడే 2006 సంవత్సరంలో ప్రపంచ బౌద్ధ మతగురువైన దలైలామా 'కాలచక్ర' క్రతువును నిర్వహించారు. ప్రపంచం నలుమూలల నుంచి బౌద్ధులు, చరిత్రకారులు, పర్యాటకులు వచ్చి ఈ బౌద్ధారామంలో 'ధ్యానముద్రలో ఉన్న తథాగతుణ్ణి సందర్శించి తరించిపోవటం ఈ ప్రాంతంలో ఒక నిత్యకృత్యం.

అప్పటి రాజులు హిందూ మతాన్ని పోషిస్తే వారి రాణులు బౌద్ధాన్ని వ్యాపింపజేశారని ఉవాచ. శివకేశవులకు నెలవైన ఈ నేలలో బౌద్ధంతోపాటు జైన ధర్మం కూడా ప్రజల్ని ప్రభావితం చేసినట్లు తెలుస్తుంది. కంటకసేల (నేటి ఘంటశాల) గ్రామస్తుడు, గృహస్తుడు, వర్తకశ్రేష్టి అయిన ధమ్మ వనియ కుమారులు–బుద్ధసిరి, ఉఖసిరి –జైన మందిరాన్ని పెట్టి పోషించారని 'వర్ధమాన్' (అదే నేటి వడ్డమూడి)లో లభ్యమయిన శిలామండపంపై చెక్కబడి ఉంది. ఈ ప్రాంతవాసులు ఎంతో మతసామరస్యంతో ఉండేవారని, అందుకే అమరావతిని 'సిటీ ఆఫ్ టాలెరెన్స్'గా పరిగణించారు.

కృష్ణానది ముఖద్వారాన అటు రాయలసీమకు, ఇటు ఉత్తరాంధ్రకు నట్టనడుమన కోస్తా తీరప్రాంతంలో వెలసి ఉన్న మన అమరావతి అత్యంత ఫల ప్రదాయిని పట్టణంగా పేర్కొనవచ్చును. అందుకే కాబోలు దగ్గర్లో గల 'ధరణి కోట'ను రాజధానిగా చేసుకుని శాతవాహనులు పరిపాలన సాగించారన్నది చారిత్రక సత్యం. ఆ తర్వాత వచ్చిన ఇక్ష్వాకులు, చాళుక్యులు, చోళులు, కోట రాజులు, పల్లవులు, కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర అధిపతులు విభిన్న భౌగోళిక ప్రాంతాల్ని, భిన్న సంస్కృతుల్ని సమ్మిళితం చేసి భిన్నత్వంలో ఏకత్వానికి గట్టి పునాదులు వేశారు. అందుకే కాబోలు మన అమరావతిని 'కల్చరల్ క్యాపిటల్' అని కూడా అభివర్ణిస్తారు.

ఆరు వందల సంవత్సరాలకు పైబడి బౌద్ధం తెలుగు ప్రజానీకాన్ని వెలుగు బాటలో నడిపింది. నాగార్జున, ఆర్యదేవ, అసంగా, వసుబంధు, దిగ్నాగ, ధర్మకీర్తి అనే ఆరు వజ్రాలతో భరత వర్షం (జంబూద్వీపం) అలంకరింపబడిందని బౌద్ధ వాఙ్మయం చెబుతుంది. ఆ ఆరు వజ్రాలలో నలుగురు ఆంధ్రులు కావటం మనకు ఎంతో గర్వకారణం. కృష్ణా– గోదావరి– పెన్నా తీరాల్లో వీరి ప్రేరణతో ఆనాటి పాలకులు నిర్మించిన విహారాలు, చైత్యాలు, విశ్వవిద్యాలయాలు ప్రపంచ ఖ్యాతిని ఆర్జించుకున్నాయి. ఈనాటికీ తెలుగునాట నలుమూలల పురాతత్వ పరిశోధనల్లో వెల్లడవుతున్న బౌద్ధ శిథిలాలు మన సాంస్కృతిక చరిత్రలో బౌద్ధయుగం ఒక స్వర్ణయుగమని తెలియజేయటానికి తార్కాణాలు. కాలగర్భంలో తెలుగునాట బౌద్ధం ఒక దీపికలాగా మిగిలిపోయినా, బుద్ధుని బోధనలు ప్రతి తెలుగువారి ఇంట ఈనాటికి స్మరింపబడటం విశేషం. బౌద్ధానికి కేంద్ర బిందువుగా విరాజిల్లిన మన 'అమరావతి'ని రాష్ట్ర రాజధానిగా ప్రకటించుకుని నగర నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న ఈ శుభ తరుణంలో గృహస్థుని జీవితాన్ని, అతని కౌటుంబిక, సామాజిక, సాంప్రదాయక విలువల సంబంధాల్ని ఎంతో హృద్యంగా మానవాళికి ఇచ్చిన బుద్ధుని సందేశాన్ని ఈ సందర్భంగా మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శృంగాలుడనే సంపన్న గృహస్థుడు తన తండ్రి అవసాన దశలో ఇచ్చిన సలహా మేరకు ఆరు దిశలు తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం, ఊర్ధ్వ, అధో దిశలకు నమస్కారాలు చేస్తుండే వాడు. తన ధమ్మానికి చెందిన ఆర్య విధానం ప్రకారం ఈ ఆరు దిశలూ ఆరు మానవ ధర్మాలకు ప్రతీక అని బుద్ధ భగవానుడు అంటాడు. ఆయన చెప్పిన ఆరు దిశలు తల్లితండ్రులు తూర్పు దిశ, సంఘము పడమర దిశ, ఆచార్య ప్రాచార్యులు దక్షిణ దిశ, బంధుమిత్రులు ఇరుగూ పొరుగూ ఉత్తర దిశ, ఆధ్యాత్మిక విద్యను గరిపే గురువులు అధోదిశ, శ్రమణులు ఊర్ధ్వ దిశ. ఈ ఆరు దిశలకు నమస్కరించాలంటారు బుద్ధ భగవానుడు. ఇది ఒక సమకాలీన సామాజిక పరిస్థితులకు ప్రతిబింబం. అదే క్రమంలో ఆదాయాన్ని ఎలా ఆదా చేయాలో, ఖర్చు చేయాలో లాంటి వివరాలు శృంగాలునికి చేసిన ఉపదేశంలో బుద్ధుడు చెపుతాడు. కష్టపడి న్యాయంగా సంపాదించు. కూడిన ధనాన్ని నాలుగు భాగాలుగా విభజించి సద్వినియోగపర్చు. కుటుంబ పోషణకు, వ్యాపార, వర్తక విస్తరణకు, బీదసాదలకు వరుసగా మూడు భాగాలు వినియోగించి, మిగిలినది ఏదైనా అత్యవసర ఆపత్కాలానికి అట్టి పెట్టుకోమని సలహా ఇస్తాడు. భావితరాలకు బంగారు బాట ఈ సందేశం.

పుట్టిన గడ్డన మరుగైన బౌద్ధం, ఆసియా ఖండంలో ఇంకా ప్రజ్వలిస్తుండటం గమనార్హం. అలాంటి ఆసియా దేశాలైన సింగపూర్, జపాన్, చైనా దేశాల సాంకేతిక సహకారంతో, దేశీయ నైపుణ్యాన్ని మెరుగుపరచి, కొత్త రాజధాని నిర్మాణ క్రమంలో బుద్ధుని బోధనలు, ప్రధానాంశాలు నేటి తరానికి పరిచయం చేసేలా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకోవటం ఆహ్వానించదగ్గ విషయం. నాలుగు దిక్కులా మహాద్వారాలు నిర్మించే దిశలో బుద్ధుడు శృంగాలునికి ఇచ్చిన సందేశాన్ని ప్రతిబింబింప చేయటం సందర్భోచితం కూడా. అమరావతి పేరుకు సార్ధకత చేకూరుతుంది ఈ క్రమంలో.

మరుగున పడ్డ మహానగరాన్ని వెలుగులోకి తెచ్చి మరలా ఆంధ్రులను ఉత్తేజపరచే మహత్కార్యమే 'అమరావతి'కి మనం పునరంకితం కావటం. మన వారసత్వ నగరాన్ని ప్రపంచ 'ఆధ్యాత్మిక రాజధాని'గా తీర్చిదిద్దడంలో మనందరి పాత్ర ఎంతైనా ఉందని గుర్తుచేసే సమయమిది.

**- దాసరి శ్రీనివాసులు, ఐఏఎస్ (రిటైర్డ్)**

---

నిజరూప దర్శనమిచ్చిన

## వరాహ లక్ష్మీనరసింహస్వామి

**భారీగా తరలివచ్చిన భక్తులు**

సింహాచలం (చైతన్య రథం): విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. వరాహ లక్ష్మీనరసింహస్వామి మంగళవారం భక్తులకు నిజ రూపంలో దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకు నేందుకు భక్తులు భారీఎత్తున సింహగిరికి పోటెత్తారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలి పారు. అనంతరం స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరుచేశారు. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి తొలి చందనాన్ని సమ ర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, తితిదే పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు ప్రోటోకాల్, అంతరా లయ దర్శనాలను ఏర్పాటు చేశారు.

---

# మీ హయాంలో కోటి ఎంతమందికిచ్చావ్?

- **మృతుల పరామర్శకు వెళ్లిన వెకిలి నవ్వులా?**
- **శవం కనిపిస్తే రాబందుల్లా వాలి శవరాజకీయాలా?**
- **వైసీపీ పాలనలో రూపాయి సాయం విదల్చలేదు**
- **ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీ బాధితులకు సాయం చేసింది**
- **టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్**



మంగళగిరి(చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక ప్రమాద ఘటనలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడ్డారు..మృతుల కుటుంబాల్లో ఎంతమందికి జగన్ కోటి రూపాయలు పరిహారం ఇచ్చాడు? అప్పుడు జగన్ బాధిత కుటుంబాలను కనీసం పరామర్శించడానికి కూడా వెళ్ల లేదు? ఇప్పుడు బాధితులను శవ రాజకీయాలకు వాడుకో వడానికి తప్పితే బాధితులను పరామర్శించడానికి వెళ్లినట్లు గా కనిపించడం లేదని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ వ్యాఖ్యానించారు. వైసీపీ హయాంలో జరిగిన ప్రమాద ఘటనల్లో బాధితులను ఆదు కున్న దాఖలాలే లేవన్నారు. నాడు కనీసం పరామర్శకైనా వెళ్లలేదు. నేడు సిగ్గు లేకుండా పరిహారం ఇవ్వాలని ఎలా డిమాండ్ చేస్తారు? అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ఎంతమంది బాధితులకు కోటి రూపాయలు పరిహారం ఇచ్చారో జగన్‌రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు.

**పరామర్శకు వెళ్లి నవ్వులా?**

విశాఖలోని సింహాచలం లక్ష్మీ నరసింహస్వామి ఆల యం వద్ద గోడ కూలి ప్రమాదంలో 8 మంది మృతిచెందితే జగన్ పరామర్శకు వెళ్లి నవ్వుతున్నారు. జగన్‌కు చనిపో యిన వారి కుటుంబాలను పరామర్శించే విధానం కూడా తెలియదు. శవాల మీద పేలాలు ఏరుకునే పద్దతిలో జగన్ అండ్ కో ప్రవర్తన ఉంది. ఎక్కడ శవం కనబడితే అక్కడ రాబందుల్లా వాలిపోతారు. రాబందుల పార్టీకి రాష్ట్ర అధ్య క్షుడు జగన్. సంఘటన జరిగిన 15 నిమిషాల్లోనే ప్రభు త్వం సహాయక చర్యలు ముమ్మరం చేసింది.ఎన్‌డీఆర్ఎఫ్, పోలీసులు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మృతుల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయ పడిన వారికి రూ.3 లక్షలు ప్రకటించారు. అంతేకాక చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఆలయంలో అవకాశం మేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పారు. 20 నిమిషాల్లోనే ఆటంకాలను పరిష్కరించి లక్షలాది మంది భక్తులకు దర్శన భాగ్యం కలిగేలా చేశారు. టీడీపీ ప్రభుత్వం సామాన్య భక్తులకు దర్శనభాగ్యం కలగాలని సామాన్యులకు పెద్దపీట వేస్తే.. గత ప్రభుత్వం 16వేల మందికి వీఐపీ దర్శ నాలకు టికెట్లు ఇచ్చింది. వైసీపీ హయాంలో సింహాచలం పైన మూడు నామాలు తీసేశారు. అప్పుడు దేవాదాయ మంత్రి కొట్టు సత్యనారాయణను భక్తులు నిలదీశారు. అప్పు డు గుడ్డి గుర్రానికి పళ్లుతోముతున్నారు. జగన్‌కు సింహా చలం టెంపుల్‌పై గౌరవం లేదు. ఎంతసేపు ఆలయాలను కొల్లగొట్టడం తప్ప. ఢిల్లీలోని మహిళను ఆలయ అధికారి గా పెట్టి ఆలయ ఆస్తులు కొల్లగొట్టారు. ఆ తరువాత అశోక గజపతిరాజు హయాంలో అవకతవకలు బయటపడ్డాయి.

**వైసీపీ హయాంలో ఆలయాల్లో అపచారాలు**

అంతర్వేది తగులబడింది వైసీపీ హయాంలో కాదా? రామతీర్థంలో అపచారం జరిగింది వైసీపీ హయాంలో కాదా? ఇన్ని జరిగినా ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్ప లేదు. ఈ విషయాలను ప్రజలు మరచిపోరు. గత ప్రభుత్వ హయాంలో అనేకమంది చనిపోయారు. గోదావరి కచ్చ లూరి బోటు ప్రమాదంలో 47మంది చనిపోయారు. అన్న మయ్య డ్యాం కొట్టుకుపోయి 37మంది, విశాఖలో ఎల్జీ పాలిమర్స్ ప్రమాదం జరిగి 12మంది, రుయా ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 11 మంది, విశాఖలో క్రేన్ కుప్పకూలి 11 మంది మృతిచెందారు. బెజవాడ కోవిడ్ కేర్ సెంటర్‌లో అగ్నిప్రమాదం జరిగి 10 మంది చనిపోయారు. ఏలూరు జిల్లా పోస్ కెమికల్స్‌లో అగ్నిప్రమాదం జరిగి 6 మంది చనిపోయారు. ప్రకాశం జిల్లా పామూరులో శానిటైజర్ తాగి 13 మంది మృతిచెందారు. అలాగే జంగా రెడ్డిగూడెంలో నాటుసారా తాగి 46 మంది మృతిచెందారు. అప్పుడు టీడీపీ రాజకీయం చేయలేదే? మేము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు అండ గా ఉంటాం. ప్రతిసారి టీడీపీ బాధితులకు సహాయం చేస్తూ వస్తోంది. వైసీపీ ఒక్క రూపా యి సహాయం చేయలేదు. 7 నెలల క్రితం బుడమేరు సంఘటన జరిగినప్పుడు వైసీపీ నాయకులు ఉత్తుత్తి పరామర్శ చేశారే గాని బాధితులకు ఎటువంటి సహాయం చేయ లేదు. సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఎలా? వైసీపీ హయాంలో హిందు మతంపై జరిగిన దాడి ప్రజలు మరచిపోరు. ఇప్పటికైనా బాధితలను పరామర్శించే విధా నాన్ని జగన్ తెలుసుకోవాలని హితవుపలికారు. తాము ఎల్లప్పుడూ భక్తులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**మీరు చేసిన తప్పులు ప్రజలు మరిచిపోలేదు**

సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు మాట్లాడినంత మాత్రాన మీరు చేసిన తప్పులు ప్రజలు మర్చిపోరు. హిందూ మతం మీద మీకు ఉన్న వ్యతిరేకతను ప్రజలు మరిచిపోరు. జగన్ బాధితుల వద్దకు వెళ్లి నవ్వుతారు. శవ రాజకీయాలే చేస్తారు. ఇప్పటికైనా మీ పద్ధతి మార్చుకోవాలని హితవుపలికారు. గోడ కూలిన ఘటనలో రాత్రి ఆ ఏరియాలో రెండు గంటల సమయంలో అతి పెద్ద వాన కురిసింది. లేకపోతే ఇలాంటి ఘటన జరిగేది కాదు. తలనీలాలను కూడా మాయం చేసిన ఘనాపాటీలు వైసీపీ నాయకులు. ఆలయంలోని బంగారం, ఇత్తడిని సైతం మాయం చేశారు. అన్న ప్రసాదం కోసం విరాళాలు ఇస్తే వాటిని కూడా మాయం చేశారని ధ్వజమెత్తారు.

## మహిళలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుంది : ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): మహిళలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, ప్రభుత్వం స్వయం ఉపాధి ద్వారా కల్పిస్తున్న ఇటువంటి శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం పార్వతీపురంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందగలిగితే ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబాలను చక్క దిద్దుకోవచ్చని అన్నారు. ఆ దిశగా మీకు ఈ కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఇటువంటి శిక్షణలో రాణించి ఆర్థికంగా బలోపేతమై ఇంటికి మహిళలే మహారాణులు అన్న పేరును మీరంతా తీసుకురావాలన్నారు. మీరు మీ భర్తల ఆదాయంపై ఆధారపడకుండా మీరు కూడా ఒక ఆదాయాన్ని తీసుకొచ్చి భర్త ఆదాయానికి తోడుగా నిలవాలన్న ఉద్దేశంతో ఇటువంటి శిక్షణను మీరంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో ఎంత ప్రావీణ్యత పొందుతే అంతా ఆదాయం పొందవచ్చని అన్నారు. ఒకే డిజైన్ కుట్టడానికి పరిమితం కాకుండా వివిధ రకాల మోడల్స్ దుస్తులు కుట్టగలిగితే చాలా ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చని, తద్వారా తమ కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడొచ్చు అన్నారు. మీరంతా ఈ శిక్షణలో రాణించి పలువురు మహిళలకు ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, పట్టణ కార్యదర్శి మజ్జి వెంకటేష్, కౌన్సిల్ సభ్యులు బడే గౌరునాయుడు, టి వెంకటరావు, టీడీపీ సీనియర్ నాయకులు గుంట్రెడ్డి రవికుమార్, భాను దేవిచంద్రమౌళి, అక్కెన శివ, డాక్టర్ గరిమెళ్ళ భానుప్రసాద్, కోలా మధుసూదన రావు, రౌతు వేణుగోపాల్ నాయుడు, పాలకొండ రాజశేఖర్, సారిక గణేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శిక్షణా కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



కంచిలి (చైతన్యరథం): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పలు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం, కొత్త రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కంచిలి భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఆరు ట్రై సైకిళ్లతోపాటు సీపీ చైర్స్, వినికిడి యంత్రాలు అందించారు. మహిళలకు కోసం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. కంచిలిలో జూన్ ఒకటో తేదీ నుంచి పది రోజులపాటు నిర్వహించనున్న కంచమ్మ తల్లి సంబరాలు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సంబరాల కమిటీ, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఐ మంగరాజు, పాఠశాల ఎస్‌వో రజనీ కుమారి, ఎంపీడీవో వి.తిరుమలరావు, తహసీల్దార్ రమేష్ కుమార్, ఎస్ఐ పారినాయుడు, ఈడీ గడ్డమ్మ, ఎంఈవో పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

శ్రీకాకుళం (చైతన్యరథం): మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఉదయం ఆయన బలరాంపురంలో మత్స్యకారుల భరోసా అందజేశారు. తొలుత సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు.. వేట నిషేధ భృతిని రూ.20వేలు చొప్పున అందించారు. ఇంకా కొంతమంది మత్స్యకారులకు భరోసా అందలేదని తన దృష్టికి వచ్చిందని, ఈ విషయమై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములు : మంత్రి అచ్చెన్నాయుడు

**●అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మే' డేని పురస్కరించుకొని కార్మిక లోకానికి శుభాకాంక్షలు**



అమరావతి (చైతన్యరథం): ప్రజా పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తోందని, కార్మికులకు సముచిత గౌరవం లభిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అలు పెరగకుండా శ్రమిస్తున్న కార్మికులందరికీ 'మే డే' సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం వారి అభ్యున్నతికి తప్పకుండా దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల శ్రమ వల్లే సమస్త సంపదలు సమకూరుతాయని చెప్పారు.వారికి శుభం చేకూరాలని మనసారా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశ్రుతి...

## గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి

సింహాచలం (చైతన్యరథం): విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది. అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.


**మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు**

మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్వేర్ దంపతులు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్లు నిర్ధరించారు. వీరంతా విశాఖపట్నం నగరానికి చెందినవారు.

**భారీగా తరలివచ్చిన భక్తులు**

వరాహ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఇప్పటికే భారీ ఎత్తున సింహగిరికి పోటెత్తారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరుచేశారు. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు.

## నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి : నిమ్మక జయకృష్ణ




పాలకొండ (చైతన్యరథం): నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని నూతన చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆమెను అభినందించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడారు. తనకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన కూటమి ప్రభుత్వానికి, స్థానిక రెల్లికుల అభివృద్ధి సంఘానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు, రెల్లికుల సంఘం నాయకులు మజ్జి బాబ్జీ, బెవర ప్రసాద్, లోకొండ గణేష్, పిన్నింటి బాలరాజు, కొట్నాన అప్పన్న, సొండి సింహాచలం తదితరులు పాల్గొన్నారు. నగర పంచాయతీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మల్లీశ్వరికి కూటమి పార్టీలకు చెందిన కౌన్సిలర్లు, పాలకొండ ఎంపీపీ బొమ్మాళి భాను, సుధాకరరావు దంపతులు అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకుడు పల్లా కొండలరావును నూతనంగా ఎన్నికైన నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూ ర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సత్కరించారు. పార్టీలకతీతంగా పని చేస్తూ పాలకొండను అభివృద్ధి బాటలో నడపాలని కొండలరావు ఆమెకు మార్గనిర్దేశం చేశారు.

## కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మామిడి

హిరమండలం (చైతన్యరథం): మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసు కోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీసీ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇటువంటి శిక్షణలను అందిస్తోందని, వీటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ టీసీ పి.బుచ్చిబాబు, ఎంపీడీవో కాళీప్రసాదరావు, ఎంఈవో కె.రాంబాబు, మండల ప్రత్యేక ఆహ్వా నితుడు తూలుగు తిరిపతిరావు, టీడీపీ నేతలు యాళ్ల నాగేశ్వరరావు, లాడే కృష్ణ, హెచ్ఎం టి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



## ఉమామహేశ్వర్ పాడె మోసిన గంటా రవితేజ



మధురవాడ (చైతన్యరథం): సింహాచలం కొండపై గోడ కూలిన సంఘటన దురదృష్టకరమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన చంద్రపాలెంకు చెందిన సాఫ్ట్‌వేర్ దంపతులు పిల్లా ఉమామహేశ్వర్, పిల్లా శైలజ కుటుంబాలను బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని ఈ సందర్భంగా రవితేజ చెప్పారు. అనంతరం ఉమామహేశ్వర్ పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## బుడమేరు గండ్లు మరమ్మత్తులకు పూర్తైన టెండర్ల ప్రక్రియ

- సీజన్ మొదలయ్యే నాటికి పనులు పూర్తి చేయాలి
- ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి నిమ్మల



పాలకొల్లు (చైతన్యరథం): బుడమేరు ఆకస్మిక వరదలకు కారణమైన మూడు గండ్లుకు సంబంధించిన మరమ్మత్తుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తవ్వడంతో, పనులు వెంటనే మొదలుపెట్టి, సీజన్ పూర్తయ్యేలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు జలవనరుల శాఖ మంత్ర నిమ్మల రామానాయుడు. బుధవారం అమరావతి సచివాలయంలో బుడమేరు ఆధునీకరణ, పోలవరం ఎడమ కాలువ పనులపై, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారాయన. ఈ సమీక్షలో ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈలు, ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు, మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి నిమ్మల రామానాయుడు. బుడమేరు వరద ఎనికేపాడు మీదుగా కొల్లేరు మీదుగా, ఉప్పుటేరు నుండి సముద్రంలో కలిసేలా, ప్రత్యేకంగా డీపీఆర్ తయారు చేసి నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా బుడమేరు ఓల్డ్ ఛానెల్‌కు సమాంతరంగా, మరొక కొత్త ఛానెల్‌ను కూడా 20 వేల క్యూసెక్కుల సామర్ధ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మేనేజ్మెంట్ కింద, కేంద్రం సహకారంతో ముందుకు వెళ్ళేలా, మున్సిపల్, రెవిన్యూ, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖల సమన్వయంతో అంచనాలు తయారు చేసి ముందుగా నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తామని అన్నారు. భవిష్యత్తులో బుడమేరు వరదల వల్ల విజయవాడకు ఎటువంటి ప్రమాదం లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

## రాజధాని నిర్మాణంతో బావితరాలకు బంగారు భవిష్యత్

- కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి



అంబేద్కర్ (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0 కు శ్రీకారం చుట్టిందని అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 65 వేల కోట్లతో 217 స్క్వేర్ కిలోమీటర్లతో 80352 స్క్వేర్‌కి.మీ విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దుకోబోతుందని చెప్పారు. అమరావతి ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందనీ చెప్పారు. అమరావతి నగర విద్యుత్ అవసరాల నిమిత్తం 2,700 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని వినియోగించుకునేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయని చెప్పారు. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందనీ తెలిపారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి 15 వేల కోట్ల రుణం మంజూరైందని జర్మనీకి చెందిన డెవలప్మెంట్ బ్యాంకు కేఎఫ్ డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు రుణం పొందేందకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలు పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మరో 4,400 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. మొత్తం 15,400 కోట్లు అమరావతి నిర్మాణానికి టిడ్కో రుణ సదుపాయం కల్పించడం హర్షణీయమన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందన్నారు. అమరావతి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సినవసరం లేదని ప్రభుత్వ ఆదీనంలో ఉన్న భూమిని దశలవారీగా అమ్ముతూ రాజధాని నిర్మాణానికి చేసిన అప్పులను వడ్డీలతో సహా చెల్లించవచ్చునన్నారు.

## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

కొత్తపేట (చైతన్యరథం): రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఇందులో భాగంగా రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తున్నామన్నారు. ఆలమూరులో మంగళ వారం రైతులకు ఆరు పవర్ టిల్లర్స్‌ను అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీలావణ్య, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో ఎ.రాజు, కూటమి నాయకులు, పలువురు అధికారులు తదిత రులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు: ఆలమూరు మండలం గుమ్మిలేరులో వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మోదుకూరులో ఎన్టీఆర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న కిమిడి నాగార్జున

విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జిల్లా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్గా నియమితులైన కిమిడి నాగార్జున బుధవారం జిల్లా కేంద్రంలోని పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తెదేపాలో కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ నుంచి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తలకు మరింత అందుబాటులో ఉంటూ పార్టీకి సేవ చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా నాగార్జునను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.



## ఎన్డీయే హయాంలోనే అమరావతి అభివృద్ధి

ఏలూరు (చైతన్యరథం): ఎన్డీఏ హయాంలో రాజధాని అమరా వతి అభివృద్ధి చెందుతుందని, మే 2న ప్రధాని నరేంద్రమోదీ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రధాని సభను కూటమి శ్రేణులు విజయవంతం చేయాలని వారు పిలుపుని చ్చారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి రైతులు, ప్రజలు 34 వేల ఎకరాలు నాటి తెలుగుదేశం ప్రభు త్వానికి అప్పగించారన్నారు. అనంతరం అధి కారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూర్ఖంగా రాజధాని అమరావతిని నిర్లక్ష్యం చేసింద న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రధాని మోదీని రాజధాని పనులు పునఃప్రా రంభించేందుకు రావాలని కోరారన్నారు. మోదీ సభను విజయవంతం చేయడానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కృషి చేయాలన్నారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అంతకుముందు టీడీపీ జిల్లా కార్యాలయంలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో సమావేశమై కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం రాష్ట్రానికి ఎంత అవసరమో మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు వివరించారు. ప్రధాని విజయ వంతం చేయాలని నేతలు, కార్యకర్తలను ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చింత మనేని ప్రభాకర్, బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మే యర్ షేక్ నూర్జహాన్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, దాసరి శ్యాం సుందర్ శేషు, దాసరి ఆం జనేయులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు, ఘంటా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



## అమరావతి పునర్నిర్మాణంతో భావితరాలకు బంగారు భవిష్యత్

**సంక్షేమంతోపాటు అభివృద్ధిని సాధించే కూటమి ప్రభుత్వం : జ్యోతుల నవీన్**



కాకినాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టి కలిగిన నాయకుడని, ఆయన నాయకత్వంలో అమరావతి రాజధాని పునర్నిర్మాణం ద్వారా భావితరాలకు బంగారు భవిష్యత్‌ను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. బుధవారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాం ఘటనలో మరణించిన వారికి నివాళులు అర్పించిన నవీన్, సింహాచలంలో భక్తుల మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టింది. '65 వేల కోట్లతో 217 స్క్వేర్ కిలోమీటర్లతో 8 వేల 3వందల 52 స్క్వేర్ కి.మీ విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దుకోబోతుంది. అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుంది. 'అమరావతి నగర విద్యుత్ అవసరాల నిమిత్తం 2,700 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని వినియోగించుకునేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు. గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, సైబరాబాద్ వంటి ప్రాజెక్టులతో అభివృద్ధికి బీజం వేసిన చంద్రబాబు, ఇప్పుడు అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాల రాజధానిగా తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయలతో మాస్టర్ ప్లాన్ రూపొందించారని తెలిపారు. అభివృద్ధితోపాటు సామాజిక న్యాయం, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నవీన్ తెలిపారు. "పేదలకు ఇళ్ల నిర్మాణం, యువతకు ఉపాధి, వృద్ధులకు పింఛన్లు, రైతులకు నష్ట పరిహారాలు వంటి సంక్షేమ పథకాల అమలుతో పాటు, రాజధాని నిర్మాణం వంటి బృహత్తర అభివృద్ధి ప్రాజెక్టులను సమపాళ్లలో నడిపించగల సామర్థ్యం కేవలం కూటమిప్రభుత్వానికే కే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్ హయాంలో అమరావతిని నిర్వీర్యం చేయాలని ప్రయత్నించారని ఆరోపించిన నవీన్, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయానికి గురిచేశారని విమర్శించారు. ప్రధాని మోదీ మే 2న అమరావతి పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో, ఇది రాష్ట్ర అభివృద్ధికి తిరుగు లేని మలుపు అవుతుందని తెలిపారు.

## అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక

తణుకు /మంగళగిరి (చైతన్యరథం): అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి మే 2వ తేదీన వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికి, ఆ సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాలకు సంబంధించి సన్నాహక సమావేశం మంగళగిరి పట్టణంలోని నాంచారమ్మ చెరువు వద్ద గల శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి స్వామి వారి కల్యాణ మండపం నందు పెద్ద ఎత్తున జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు మంగళగిరి నియోజకవర్గం నుంచి కూటమి శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరా వాలన్నారు. శ్రేణులను, కార్యకర్తలను సమీకరించి తరలించే ఏర్పాట్లను నాయకులు చేయాలని సూచించారు. ప్రజల్ని చైతన్యపరచి అన్ని గ్రామాలు, వార్డులలోని కూటమి నాయకులు వారిని వెంట పెట్టుకుని సభకు తరలించే ఏర్పాట్లును వ్యక్తిగతంగా చేపట్టి విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధితో ఆదాయం మెండుగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నిర్మాణానికి శ్రమిస్తున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమరావతికి తూట్లు పొడిచి, ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేశారని ఎద్దేవా చేశారు. అమరావతి పునర్నిర్మాణం కోసం లక్షల కోట్లు వెచ్చించి, ప్రధాని మోదీ ఆధ్వర్యంలో పలు శంకుస్థాపనలు 2వ తేదీన జరుగనున్నాయన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గముల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందన్నారు. మోదీ చేతుల మీదుగా జరిగే ప్రజా రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు అనుకున్న లక్ష్యం ప్రకారం పూర్తైతే, ప్రపంచం గర్వించే రాజధానిని ప్రజలంతా చూస్తారని చెప్పారు. అమరావతి రాజధాని ఫలాలు పేద వర్గాలకు అంది వారు సంతోషంగా జీవించేలా చేయాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచన అని తెలిపారు.

## కార్మిక సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం : ఎంపీ కేశినేని



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలోని కార్మికులు, కర్షకులు, శ్రామికులు తమ శ్రమను ధారపోస్తూ దేశ, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా పని చేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. ఉత్పత్తి, సేవారంగాలను బలోపేతం చేసే దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం. తిరిగి కార్మికుల, పేదల జీవితాల్లో వెలుగు నింపుతుంది. మేడే సందర్భంగా కార్మిక, శ్రామిక,కర్షక లోకానికి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఒక ప్రకటన విడుదల చేశారు. "కార్మికులు సంక్షేమంతో వర్ధిల్లినప్పుడే సమాజ ప్రగతి సాధ్యం. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుంది. ఉచిత ఇసుకవిధానాన్ని అమల్లోకి తీసుకువచ్చి కార్మికులకి అండగా నిలబడింది. వారి జీవితాల్లో వెలుగులు నింపింది. అలాగే రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు కుటుంబానికో పారిశ్రామికవేత్తగా వుండాలన్న ఆశయంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. అలాగే సమాజంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన పీ4 విధానం పేదలు, కార్మికుల కుటుంబాలకు చేయూతగా మారింది. పరిశ్రమలే రాష్ట్ర ప్రగతికి మెట్లు ..అయితే గత ఐదేళ్ల దుర్మార్గ పాలనలో రాష్ట్రం ప్రగతికి దూరమైంది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన పదినెలల్లో రాష్ట్రంలో పలు పరిశ్రమల స్థాపనతో పారిశ్రామిక రంగం కళకళలాడుతూ.. తిరిగి కార్మికుల, పేదల జీవితాల్లో వెలుగు కిరణాలు ప్రసరిస్తున్నాయి. టీడీపీ కార్మిక లోకానికి అండగా వుంటుంది". అని ఎంపి కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

## అమరావతి సభను విజయవంతం చేయండి : భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): మండలంలో రాజధాని అమరావతి పునః ప్రారంభ సభ జయప్రదం చేయాలని కోరుతూ మండల నాయకులతో జరిగిన సమావేశంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మే 2న జరిగే అమరావతి రాజధాని అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారని, ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న సభలో నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సభను జయప్రదం చేయడంతోనే రాష్ట్రానికి పెద్ద ఎత్తున హామీలు వచ్చి అభివృద్ధి సాధ్యమవుతుందన్న ఎమ్మెల్యేలు... భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం జరిగే చారిత్రాత్మక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

## జగన్‌ది శవ రాజకీయమే కానీ సేవా రాజకీయం కాదు

- సింహాచలం బాధితులకు ఒక్కరూపాయి ఇవ్వకుండా ప్రభుత్వంపైనే విమర్శలా?
- అప్పన్న సన్నిధిలో గోడ కూలిన దుర్ఘటన హృదయవిదారకం
- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ



గుంటూరు (చైతన్యరథం): సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిసరాల్లో గోడ కూలిన ఘటనపై ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుర్ఘటన హృదయవిదారకమని, ఎనిమిది మంది భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత మంగళవారం అర్ధరాత్రి సింహాచలంలో వర్షం బీభత్సం సృష్టించిందని, ఏడాదికోసారి చందనోత్సవం రోజు లభించే నిజరూప దర్శనం కోసం వేచి వున్న భక్తుల ఆనందాన్ని ఆవిరి చేస్తూ, ప్రాణాలను బలగొనడం అత్యంత బాధాకరమన్నారు. రూ.300 టికెట్ క్యూలైన్ వద్ద గోడ కూలి భక్తులు మృత్యువాత పడటంతో గుండెలు పిండేసే దృశ్యాలు, రోదిస్తున్న బంధువులు... అక్కడి వాతావరణం చెప్పలేని విషాదంలో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఈ విషాదంలో కూడా "జగన్ మార్క్ రాజకీయం" మొదలైందని, అయ్యో పాపం అనాల్సిన సందర్భంలో విమర్శలు మొదలు పెట్టడం, ప్రకృతి విపత్తుల వల్ల జరిగిన నష్టాన్ని ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన ప్రమాదంతో, బాధితుల పట్ల దేశమంతా సానుభూతి చూపిస్తుంటే, జగన్‌రెడ్డి మాత్రం శవ రాజకీయం చేస్తున్నాడని, 21.5మి.మీ. వర్షపాతం వల్లే గోడ కూలినట్లు ప్రాథమిక సమాచారం ఉన్నా... ప్రభుత్వం ఏం చేస్తోంది? కూలైన్ ఎందుకు పెట్టారు? అంటూ ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణమన్నారు. భక్తుల ప్రాణాలు పోయినప్పుడు కూడా మౌనం పాటించలేని జగన్ వికృత రాజకీయం చూస్తుంటే భయం వేస్తోందన్నారు. ఓ విషాదాన్ని కూడా ప్రభుత్వంపై దుష్ప్రచారానికి వేదికగా మార్చే వైఖరిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. జగన్ సింహాచలం వెళ్లి బాధితులకు ఒక్కరూపాయి ఇవ్వకుండా సత్వర సహాయం చేసిన కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం నీచమన్నారు. జగన్‌ది శవ రాజకీయమే కానీ సేవా రాజకీయం కాదని, ఘటనపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల పరిహారం, గాయపడిన వారికి రూ.3 లక్షల పరిహారం అందించడం జరుగుతుందన్నారు. ప్రమాదానికి కారణమైన నిర్మాణ లోపాలపై తక్షణమే విచారణకు ఆదేశించడం జరిగిందని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని మోహన్ కృష్ణ హెచ్చరించారు.

## ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ఛైర్మన్‌గా షేక్ హసన్ బాషా ఏకగ్రీవ ఎన్నిక




విజయవాడ (చైతన్యరథం): ఏపీలో చక్కటి హజ్ హౌస్ నిర్మిస్తామని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ఛైర్మన్ షేక్. హసన్ బాషా అన్నారు. ఏపీ హజ్ కమిటి మొదటి సమావేశం, ఛైర్మన్ ఎన్నిక విజయవాడలోని హజ్ కమిటీ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా హజ్ కమిటీ నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన షేక్. హసన్ బాషా మాట్లాడుతూ... మన రాష్ట్రం హజ్ కమిటీ లేదని, హజ్ హౌస్ లేదని, మా కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు సేవా భావంతో అత్యుత్తమ సేవలను అందిస్తామని హామీ ఇచ్చారు. హజ్ కమిటీ ఛైర్మన్‌గా నాకు అవకాశం ఇచ్చిన ఆ దైవానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ధన్యవాదాలు తెలిపారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ అందరూ బలపరచిన షేక్. హసన్ బాషాను ఏకగ్రీవంగా ఛైర్మన్‌గా ఎన్నిక అవ్వడం అభినందనీయమన్నారు. మా కమిటీ ఆధ్వర్యంలో దేశంలోనే ఆదర్శ హజ్ కమిటీగా నిలపటానికి శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు. హజ్ యాత్రికుల కు సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు.

## రాజధాని పునర్నిర్మాణంతో బావితరాలకు బంగారు భవిష్యత్ : డేగల ప్రభాకర్



గుంటూరు (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతికి శ్రీకారం చుట్టిందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. బుధవారం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఛైర్మన్ ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా జరగనున్న అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవంలో అన్ని ప్రాంతాల ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అందరి రాజధానిగా అమరావతి నిర్మాణం సాగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయి. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వం పరిపాలనానుమతులు మంజూరు చేసిందన్నారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రుణం మంజూరైందన్నారు. జర్మనీకి చెందిన డెవలప్మెంట్ బ్యాంకు కేఎఫ్ డబ్ల్యూ నుంచి రుణం పొందేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందన్నారు. పదేళ్ల తరవాత సైబరాబాద్ వద్ద పెరిగినట్లు ఇక్కడ భూములు విలువ పెరుగుతుందన్నారు.

## డ్వాక్రా మహిళలకు కోరినంత రుణం : మాజీమంత్రి ప్రత్తిపాటి

- స్వయం ఉపాధి రుణాలే కాక, ఇంటినిర్మాణానికి చేయూత



చిలకలూరిపేట (చైతన్యరథం): శక్తియుక్తులే మహిళలకు మేలైన ఆభరణాలని, బంగారంపై ఎంతో మక్కువ చూపే స్త్రీలు... తమలో దాగిఉన్న పసిడిని మించిన ప్రతిభాపాటవాలకు పదును పెట్టి, నేర్చుకున్న విద్యల్లో రాణించి అనుకున్న లక్ష్యాలను సాధించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. కుటుంబాలను చక్కదిద్దడంలో నిష్ణాతులైన మహిళలు, తమకు నచ్చిన వృత్తుల్లో కూడా అంతకంటే మిన్నగా అందరూ మెచ్చేలా ఎదగాలని ప్రత్తిపాటి తెలిపారు. పట్టణంలోని సుభానీ నగర్ లోని ముస్లిం కమ్యూనిటీ హాల్ నందు రాష్ట్ర బీసీ, ఈ.డబ్ల్యూ.ఎస్ కార్పొరేషన్ల సంయుక్తంగా మహిళలకోసం నిర్వహిస్తున్న కుట్టుమిషన్ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని మాజీమంత్రి బుధవారం ప్రారంభించారు. శిక్షణకు వచ్చిన మహిళలతో మాట్లాడిన ఆయన, త్వరలోనే కూటమి ప్రభుత్వం డ్వాక్రామహిళల రుణాల లక్ష్యాన్ని పెంచనుందని, స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలనుకునే మహిళలకు విరివిగా రుణాలు అందించాలనే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. ఉపాధి మార్గాలే కాకుండా వ్యక్తిగత అవసరాలైన ఇళ్లనిర్మాణానికి కూడా రుణం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేవారికి వడ్డీలపై రాయితీలు ఇవ్వడంతో పాటు, మరలా కోరినంత రుణం అందించే ఏర్పాట్లు చేస్తుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. అటువంటి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను తీర్చిదిద్దుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.

## విప్ యార్లగడ్డ చొరవతో వంతెనలకు నూతన సొబగులు

గన్నవరం (చైతన్యరథం): ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో జాతీయ రహదారి పైన ఉన్న వంతెనలకు నూతన శోభ సంతరించుకొనుంది. రామవరప్పాడు నుండి బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామం వరకు గతంలో టిడిపి ప్రభుత్వం ఉండగా ఎంతో అందంగా సుందరంగా ఉండే జాతీయ రహదారిని గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేయడంతో అధ్వాన్నంగా తయారైంది. దీనికి తోడు పలు గ్రామాల్లో వ్యర్థాలను జాతీయ రహదారి పక్కన వేయడంతో రహదారి డంపింగ్ యార్డ్ లా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారిని సుందరీకరణ చేయాలని పలు సమావేశాల్లో ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అధికారులను కోరారు. అత్యధికంగా వీఐపీలు, వివిఐపీలు సంచరించే ఈ రహదారి సుందరీకరణ చేపట్టాలని, వంతెనలపై ప్లాట్ ఫామ్ పునర్నిర్మించి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జాతీయ రహదారుల సంస్థకు లేఖ రాశారు. యార్లగడ్డ లేఖకు సానుకూలంగా స్పందించిన జాతీయ రహదారుల సంస్థ వంతెనలపై ప్లాట్ ఫామ్ పునర్నిర్మాణ పనులను ప్రారంభించింది. కేసరపల్లి ఏలూరు కాలువపై ఉన్న వంతెన ప్లాట్ఫారం నిర్మాణ పనులను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

# ఆ ఎమ్మెల్యేలు ఇద్దరూ ఇద్దరే!

## టెంకాయ కొట్టామంటే పని పూర్తి కావాల్సిందే

### నెల్లూరు రూరల్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి స్పష్టీకరణ

నెల్లూరు రూరల్, (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ లో ముత్తుకూరు గేటు వద్ద 89 లక్షల రూపాయల వ్యయంతోఫ్లైఓవర్ బ్యూటీఫికేషన్ పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ నందన్, టీడీపీ నాయకులు



కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. 19వ డివిజన్‌లో ఇప్పటికే అభివృద్ధి పనులకు దాదాపుగా 6 కోట్ల రూపాయల నిధులను కేటాయించామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్‌కు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో 26 డివిజన్ల లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మే 15వ తేదీ 330 అభివృద్ధి పనులు 606 మంది కార్యకర్తల చేత ప్రారంభోత్సవాలు జరిగాయని గిరిధర్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మారంరెడ్డి జ్యోతి ప్రియ, తెలుగుదేశం పార్టీ నాయకులు మదన్ కుమార్ రెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రయినా టార్గెట్ పూర్తి చేయాల్సిందే

### జమ్మలపాలెం గ్రామ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, (చైతన్యరథం): అర్ధరాత్రయినా అనుకున్న టార్గెట్ పూర్తి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి జలదంకి మండలం జమ్మలపాలెం గ్రామ కమిటీల ఏర్పాటు కోసం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి రాత్రి సమయంలో కూడా శ్రమ పడుతున్నారు, మాకంటే పర్వాలేదు ఒకరోజు అయినందున మేలుకుంటాము, మీరు ప్రతిరోజు అర్ధరాత్రి వరకు మా కోసం కష్టపడుతున్నారని, ఎమ్మెల్యేని అడగగా ఒక లక్ష్యం అనుకుంటే సాధించేంతవరకు నిద్రపోనని తన విజయానికి అదే దోహద పడిందని తెలిపారు. అనంతరం గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ కమిటీని మండల నాయకులు, గ్రామ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్ణయించారు. మే నెల 25 లోపల గ్రామ కమిటీలు మండల కమిటీలు ఏర్పాటు చేయడమే నా లక్ష్యం అని ఎమ్మెల్యే తెలియజేశారు. సమష్టిగా విచ్చేసి గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుమోహన్ రెడ్డి పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య మండల, గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.



## అమరావతి జోలికి వచ్చినందుకే వైసీపీకి అధోగతి

### మళ్లీ వైభవంగా అమరావతి పనుల ప్రారంభం

### చిత్తూరు జిల్లా టీడీపీ నాయకులు

చిత్తూరు, (చైతన్యరథం): అమరావతి రైతుల త్యాగాలని అవమానపరచి, అమరావతిని తాకినందుకే జగన్మోహన్ రెడ్డి, వైసీపీ అధపాతాళానికి పడిపోయిందని చిత్తూరు జిల్లా టీడీపీ నాయకులు అన్నారు. అమరావతి రైతుల బలిదానం జరిగిందని వారి ఆకాంక్ష మేరకు అమరావతి నిర్మాణ కార్యక్రమాలు పునః ప్రారంభమవుతున్నాయన్నారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దేశ ప్రధాని మోడీ, చిత్తూరు జిల్లా ప్రజల పక్షాన ధన్యవాదాలు, కృతజ్ఞతలు, తెలియజేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ భారత దేశ రాజకీయ చరిత్రలోనే ఎప్పుడు లేని విధంగా 1631 రోజులు నిర్విరామ పోరాటం చేసిన అమరావతి రైతులు, అదేవిధంగా 230 మంది పైగా రైతులు ప్రాణ త్యాగం చేసి అమరావతిని నిలబెట్టారని అన్నారు. 3000 పోలీసు కేసుల్ని అవలీలగా ఎదుర్కొని, మహిళలు సైతం ఉద్యమాలలో పాల్గొని అమరావతి నిలబెట్టారని, అది అమరావతి శక్తి అని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు అమరావతి పైన తమ వైఖరిని మార్చుకొని మూడు రాజధానుల నినాదాన్ని పక్కన పెట్టి అమరావతికి మద్దతు పలకాలని ,లేకుంటే వైసిపి జగన్మోహన్ రెడ్డి కాలగర్భంలో కలిసిపోతారని అన్నారు. అమరావతిని కుల రాజధానిగా ముద్ర వేసి జగన్మోహన్ రెడ్డి పాతాళానికి కూరుకుపోయారని అన్నారు. మే రెండో తేదీన ప్రధాని చేతులతో శంకుస్థాపన కార్యక్రమాలు, పునర్నిర్మాణ కార్యక్రమాల ప్రారంభమవుతున్న సందర్భంగా దిగ్విజయంగా జరగాలన్నారు. సమావేశంలో టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, జిల్లా క్రిష్టియన్ అధ్యక్షుడు మేషాక్ పూతలపట్టు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ధరణి ప్రకాష్ పాల్గొన్నారు.




## పోలంపాడుకు ముఖద్వార నిర్మాణం

### శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, (చైతన్యరథం): ముఖద్వారం ద్వారా గ్రామానికి అందం చేకూరుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం కలిగిరి మండలంలోని పోలంపాడు గ్రామంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న గ్రామ ముఖద్వారానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. పురోహితుల మంత్రోచ్చారణల నడుమ కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోనికి సంఘవిద్రోహులు రాకుండా ఆపగల శక్తి ముఖద్వారానికి ఉందన్నారు. గ్రామానికి గ్రామంలో ఉండే దేవత మూర్తులను చిత్రీకరించి ముఖ ద్వారం ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామం అని తెలిపారు.ముందుగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలం, గ్రామ నాయకులు మహిళా భక్తులు దాతలు తదితరులు ఉన్నారు.



## కారు ప్రమాదంలో వైద్యవిద్యార్థుల దుర్మరణం బాధాకరం

### టీడీపీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర దిగ్భ్రాంతి

నెల్లూరు, (చైతన్యరథం): కారు ప్రమాదంలో వైద్య విద్యార్థులు మృతి చెందడంపై ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, పోతిరెడ్డిపాలెం వద్ద జరిగిన కారు ప్రమాదంలో వైద్య విద్యార్థులు మృతి చెందడం బాధాకరమన్నారు. కారు అదుపు తప్పి ఓ ఇంట్లోకి దూసుకెళ్లడంతో కారులోని ఐదుగురు విద్యార్థులతో పాటు, ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువత ఊహించని దుర్ఘటనతో తల్లితండ్రులకు, కుటుంబ సభ్యులకు తీరని క్షోభ మిగిల్చారన్నారు. వైద్య విద్యార్థుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు.



## జగన్‌తో అమరావతి విధ్వంసం ... విజనరీ సీఎం చంద్రబాబుతో వికాసం

### ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్

తిరుపతి, (చైతన్యరథం): ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందని ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందన్నారు. అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందన్నారు. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందుతోందన్నారు. అమరావతి నగర విద్యుత్ అవసరాల నిమిత్తం 2,700 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని వినియోగించుకునేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి 15 వేల కోట్ల రుణం మంజూరైంది. జర్మనీకి చెందిన డెవలప్మెంట్ బ్యాంకు కేఎఫ్ డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు రుణం పొందేందకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టారు,



గతంలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలు పూర్తి చేసి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మరో 4,400 కోట్లు నిధులు మంజూరు చేసింది. మొత్తం 15,400 కోట్లు అమరావతి నిర్మాణానికి హడ్కో రుణ సదుపాయం కల్పించడం హర్షణీయమన్నారు. రాజధానిలో నిర్మాణాలు అన్నీ పోగా మిగిలిన రూ. 2 లక్షల కోట్ల పైబడి విలువైన మిగులు భూములు అమరావతిలో ఉన్నాయి. పదేళ్ల తరవాత సైబరాబాద్ వద్ద పెరిగినట్లు ఇక్కడ భూములు విలువ ఎకరం 50 కోట్లకు పైగా పెరుగుతుందన్నారు. అమరావతిని శ్మశానం అని, ఎడారి ప్రాంతం అని, ఒక్క సామాజిక వర్గానికి చెందిన ప్రాంతం అని... అమరావతిపై కమ్మరావతి అని విద్వేష వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి అమరావతి ప్రాంతంలో దళితులు, బీసీలు ఎక్కువగా ఉన్నారన్నారు. కాపు, ముస్లీం, బ్రాహ్మణ, వైశ్య వర్గాలు అన్నీ కుడి ఎడమగా ఉన్నవని వివరించారు. డిప్యూటీ మేయర్ మునికృష్ణ మాట్లాడుతూ వైసీపీ నిర్బంధాల్లో సైతం 1631 రోజుల పాటు నిర్విరామంగా రాజధాని రైతులు పోరాటాలు చేశారు. ఈ సుదీర్ఘ పోరాటంలో 230కి పైగా రైతులు వేధింపులు తాళలేక ప్రాణాలొదిలారు. రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు... పోరాటాలు మరోవైపు, న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా అలా నిలబడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన పరిపాలనా దక్షతతో ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకులను ఒప్పించి తెచ్చిన నిధులతో అమరావతి పనులు రానున్న కాలంలో పరుగులు పెట్టబోతున్నాయన్నారు. కార్యక్రమంలో నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి నైనారు మహేష్ యదవ్ రవిశంకర్ యాదవ్ జగన్నాథం రామారావు రూపేష్ మునిరాజ తదితరులు పాల్గొన్నారు

# అమరావతి.. భావితరాల బంగారు గని!

**అనంతపురము జిల్లా పార్టీ అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్**




అనంతపురం, (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందని అనంతపురము జిల్లా పార్టీ అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో రాజధాని నిర్మించాలనే సంకల్పంతో ఉన్నారన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం ప్రధాని మోదీ అమరావతికి రానున్నారని తెలిపారు. 43 వేల కోట్ల పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగే ప్రజా రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు అనుకున్న లక్ష్యం ప్రకారం పూర్తైతే, ప్రపంచం గర్వించే రాజధానిని ప్రజలంతా చూస్తారన్నారు. లక్ష కోట్ల పనుల్ని సకాలంలో పూర్తి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకొంది. అమరావతి రాజధాని ఫలాలు పేద వర్గాలకు అంది వారు సంతోషంగా జీవించేలా చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతి ఆలోచన అని తెలిపారు. రాజధాని నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని 3 ప్రాంతాల సమానాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో ముందుకు వెళుతోంది. జగన్ తన ఐదేళ్ళ పాలనలో ఏపీ రాజధాని అమరావతిని కుప్పకూల్చి, ఎక్కడి పనులు అక్కడ ఆపేసి, రాజధాని నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు తెచ్చిన మెటరియల్‌ను కూడా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు తమ అనుచరులతో దోపిడీ చేసి కాంట్రాక్టర్లను అక్కడ నుండి తరిమేసి పైశాచికానందం పొందారన్నారు. జగన్ రెడ్డి తీసుకున్న 3 రాజధానుల ప్రతిపాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా పడిపోయి, రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువ పడిపోయిందన్నారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల 2 లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార విద్యా సంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని గుర్తు చేశారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అమరావతిలో రాజధాని నిర్మించడానికి మద్దతు తెలిపి, అధికారంలోకి వచ్చాక 3 రాజధానుల పేరుతో కుల చిచ్చు, ప్రాంతీయ చిచ్చు పెట్టి తన కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్ళించే కుట్ర చేశాడన్నారు. అక్కడి దళిత రైతులపపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా దళితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించి వారి చేతులలకు బేడీలు వేసి జైళ్ళకు తరలించి హింసించాడు. ఇన్ని నిర్బంధాల్లో సైతం 1631 రోజుల పాటు నిర్విరామంగా రాజధాని రైతులు పోరాటాలు చేసి, సుదీర్ఘ పోరాటంతో 230కి పైగా రైతులు వేధింపులు తాళలేక ప్రాణాలొదిలారు. రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు, పోరాటాలు మరోవైపు, న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా అలా నిలబడిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షతతో ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకులను ఒప్పించి తెచ్చిన నిధులతో అమరావతి పనులు రానున్న కాలంలో పరుగులు పెట్టబోతుండటం రాష్ట్రానికి శుభాకాంక్షలు పరిణామం అని గుర్తు చేసారు. అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ వెంకటేష్ రాష్ట్ర కార్యదర్శులు ఆదెన్న రామలింగారెడ్డి మాజీ గ్రంథాలయ చైర్మన్ గౌస్మొద్దీన్ పాల్గొన్నారు.

# కదిలొచ్చిన 75 వైసీపీ కుటుంబాలు

**టీడీపీలోకి భారీ వలసలు, సాదరంగా ఆహ్వానించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్**

వరికుంటపాడు, (చైతన్యరథం): వరికుంటపాడు మండలం జి కొండారెడ్డి పల్లె గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మూలే వీరారెడ్డి, ఆయన అనుచర వర్గం సుమారు 75 కుటుంబాలు వైసిపి పార్టీని వీడి బుధవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలం, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో వారి ఒప్పందం మేరకు చేరికలు జరిగాయి. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలుగుదేశం కండువాలు కప్పి వైసీపీ నాయకులను సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం లో వరికుంటపాడు మండలం నా సొంత మండలం అని ఇక్కడ నుండే తిరిగి మళ్లీ చేరికలు జరగడం శుభపరిణామం ఉన్నారు. పార్టీ పట్ల ఆకర్షితులై వచ్చే వారిని స్థానిక నాయకులు ఆహ్వానించాలన్నారు. అందరికీ ప్రాధాన్యత ఉంటుందని ఇందులో సందేహాలు వద్దన్నారు. అదేవిధంగా త్వరలో గండిపాలెంలో భారీగా చేరికలు జరుగుతాయన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 160 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియజేశారు. ఇప్పటికే 100 కోట్లు పనులు పూర్తికాగా 60 కోట్ల కు ప్రతిపాదనలు జరిగి పనులు ప్రారంభించారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి కోసం అలుపెరుగని పోరాటం చేస్తూ రోజుకు 18 గంటలు పని చేస్తున్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉదయగిరి నియోజకవర్గంలో నేను కూడా రోజుకు 18 గంటలు పనిచేస్తున్నట్లు తెలిపారు. సమిష్టిగా కృషి చేసి ఉదయగిరిని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. విభేదాలు వీడి ఐక్యతారాగంతో కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న వరికుంటపాడు మండలం నాయకత్వాన్ని అభినందించారు. ముందుగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు మూలే వీరారెడ్డి నాయకత్వంలో అనుచర వర్గం మండల నాయకత్వం పూల వర్షం కురిపిస్తూ భారీ ఎత్తున బాణా సంచాలు పేల్చుతూ బ్యాండ్ మేళం నడుమ ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను శాలువాలు పూలమాలలలు గజమాలతో ఘనంగా సన్మానించారు. జై తెలుగుదేశం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి, ఉదయగిరి ముద్దుబిడ్డ కాకర్ల సురేష్ అంటూ నినాదాలు చేశారు. పండుగ వాతావరణం లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల్ బాబు యాదవ్ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు జడ్పిటిసి సభ్యులు నాగేంద్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీనారాయణ వైస్ ఎంపీపీ దేవన బోయిన మధు గండిపాలెం ప్రాజెక్టు చైర్మన్ అడుసుపల్లి వెంకటసుబ్బయ్య వైస్ చైర్మన్ రమణారెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షులు నరసారెడ్డి మాజీ కన్వీనర్ వెంకయ్య ఉదయగిరి నాయకులు బయన్న రియాజ్ బొజ్జ నరసింహులు ఉన్నారు.

# సీసీ రోడ్డు ప్రారంభం

**కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్**

వరికుంటపాడు, (చైతన్యరథం): వరికుంటపాడు మండలం జి కొండారెడ్డిపల్లి గ్రామంలో 6.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదగా బుధవారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు అంతర్గత సిమెంట్ రోడ్డును నిర్మించడం జరిగిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 160 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిగా శాసనం చేశారన్నారు. అమరావతి పునర్నిర్మాణం చేపట్టి రాష్ట్రానికి అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాబోవు రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామి రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చంచల్ బాబు యాదవ్, మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు, జడ్పిటిసి సభ్యులు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ దేవన బోయిన మధు, సర్పంచ్ కుమ్మిత ప్రతాప్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కుమ్మిత నరసారెడ్డి వైస్ చైర్మన్ రమణారెడ్డి మాజీ మండల కన్వీనర్ వెంకయ్య తదితరులు ఉన్నారు.



# రాజధాని పునర్నిర్మాణంతో భావితరాల భవిష్యత్తు బంగారం

**దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**



దర్శి, (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ చేతులమీదుగా జరగనున్న అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవంలో అన్ని ప్రాంతాల ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అందరి రాజధానిగా అమరావతి నిర్మాణం సాగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వం పరిపాలనానుమతులు మంజూరు చేసిందన్నారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రుణం మంజూరైందన్నారు. జర్మనీకి చెందిన డెవలప్మెంట్ బ్యాంకు కేఎఫ్ డబ్ల్యూ నుంచి రుణం పొందేందకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూన్నట్లు పేర్కొన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందన్నారు. పదేళ్ల తరవాత సైబరాబాద్ వద్ద పెరిగినట్లు ఇక్కడ భూములు విలువ పెరుగుతుందన్నారు. అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందని, అమరావతి నగర విద్యుత్ అవసరాల నిమిత్తం 2,700 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని వినియోగించుకునేలా ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. ప్రజా రాజధాని అమరావతిపై జగన్ రెడ్డి విధ్వంసం చేశారని మండిపడ్డారు. జగన్ రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల ప్రతి పాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా పడిపోయాయన్నారు. అమరావతి మునిగిపోయే రాజధాని అని, అమరావతికి నిర్మాణం కోసం సమకూర్చుకున్న నిధులను ప్రజల నుండే వివిధ రూపాల్లో వసూలు చేస్తారని అబద్ధాపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల 2 లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతిలో రాజధాని నిర్మించడానికి మద్దతు తెలిపి, అధికారంలోకి వచ్చాక 3 రాజధానుల పేరుతో కుల చిచ్చు, ప్రాంతీయ చిచ్చు పెట్టి తన కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేశారని ఆరోపించారు. అమరావతిని పూర్తిగా చంపేయాలనే దుష్ట ఆలోచనలతో జగన్ రెడ్డి అండ్ కో రాజధాని రైతులను చిత్ర హింసలకు గురి చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏపీ రాజధాని అమరావతిని కుప్పకూల్చి, ఎక్కడి పనులు అక్కడ ఆపేశాడని పేర్కొన్నారు. వీలైతే కూల్చేశాడన్నారు. రోడ్లను తవ్వేసి వైసీపీ నేతలు, కార్యకర్తలకు దోచిపెట్టాడు. అమరావతిని శ్మశానం అనీ,ఎడారి ప్రాంతం అని, ఒక్క సామాజిక వర్గానికి చెందిన ప్రాంతం అని అమరావతి పై కమ్మరావతి అని జగన్ రెడ్డి అండ్ కో విద్వేష వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. వాస్తవానికి అమరావతి ప్రాంతంలో దళితులు, బీసీలు ఎక్కువగా ఉన్నారని గుర్తు చేశారన్నారు. 'రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు పోరాటాలు మరోవైపు.. న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా అలా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన పరిపాలనా దక్షతతో ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకులను ఒప్పించి తెచ్చిన నిధులతో అమరావతి పనులు రానున్న కాలంలో పరుగులు పెట్టబోతున్నాయని డాక్టర్ లక్ష్మీ పేర్కొన్నారు.

# తగిన శాస్తి ఖాయం

## పహల్గాం ఘటనపై కీలక సమావేశాలు



పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఘటనకు భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పలు కీలక సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ బుధవారం రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఇక, బుధవారం సాయంత్రం క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించారు.

### సూపర్ క్యాబినెట్..

సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ క్యాబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయ్యింది.

ఆ తర్వాత ఈ క్యాబినెట్ కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2019లో పుల్వామాలో సీఆర్పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దానిపై దేశంలో తీవ్ర అగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ దారుణ ఘటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిస్థాన్‌కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హోదాను రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. ఆ ఏడాదిలో కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి చేసి, దాయాదికి గట్టి సమాధానం ఇచ్చింది.

అత్యంత కీలక సందర్భాల్లో మాత్రమే సీసీపీఏ సమావేశం జరుగుతుంది. దేశంలోని ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక విషయాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాజకీయ చిక్కులు కలిగి ఉన్న ఆర్థిక విధానాలు, అంతర్గత భద్రతా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సహాయపడుతుంది. దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలను ఈ భేటీలో చర్చిస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.

# పాక్ చర్యకు భారత్ ప్రతిచర్య

## దుష్ప్రచారంపైనా గట్టిగా చెంపదెబ్బలు





పహల్గాం ఉగ్రదాడి తర్వాత నెట్టింట్లో విరివిగా తప్పుడు సమాచార వ్యాప్తి జరుగుతోంది. భారత్‌ను నేరుగా ఎదుర్కోలేని పాకిస్థాన్ ఈ చర్యకు పూనుకుంటోంది. చివరకు మన సైన్యం గురించి అసత్య వార్తలు ప్రచారం అవుతున్నాయి. అసలు విషయం చెప్పి, భారత్ వీటికి కౌంటర్ ఇచ్చింది. ఉగ్రదాడి తర్వాత నార్తర్న్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ సుచీంద్ర కుమార్‌ను పదవి నుంచి తొలగించారని, కస్టడీలోకి తీసుకున్నారని పాక్ అనుకూల సోషల్ మీడియాలో పలు పోస్టులు దర్శనమిచ్చాయి. భద్రతా వైఫల్యం కారణంగా ఆ చర్యలు తీసుకున్నారని వాటి సారాంశం. అవన్నీ నకిలీ వార్తలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు చెందిన ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం తేల్చిచెప్పింది. సుచీంద్రకుమార్ గురించి పాక్ అనుకూల సోషల్ మీడియా ఖాతాలు తప్పుగా పేర్కొంటున్నాయని వెల్లడించింది. వాస్తవంగా ఏప్రిల్ 30న కుమార్ పదవీవిరమణ చేస్తున్నారు. ఆయన స్థానంలో లెఫ్టినెంట్ ప్రతీక్ శర్మ బాధ్యతలు చేపట్టనున్నారని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ వెల్లడించింది. అలాగే నియంత్రణ రేఖ సమీపంలో భారత్‌కు చెందిన రఫేల్ యుద్ధ విమానాన్ని పాక్ సైన్యం కూల్చివేసిందని ఓ వార్త చక్కర్లు కొట్టింది. అది తప్పుడుకథనం అని భారత్ తేల్చిచెప్పింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత అసత్య వార్తలను ప్రచారం చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన అనేక యూట్యూబ్ ఛానెళ్లను భారత్ నిషేధించిన సంగతి తెలిసిందే. వీటిపై ప్రభుత్వం ఓవైపు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచేలా పలు వీడియోలు సోషల్ మీడియాలో పుట్టుకొస్తున్నాయి. ఇటువంటి వాటిని పరిశీలించిన పీటీఐ వార్తా సంస్థ ఫ్యాక్ట్ చెక్ విభాగం.. అందులో చాలా వీడియోలు నకిలీవని తేల్చింది. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హరియాణా అభ్యర్థించింది. లేకపోతే.. ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని పేర్కొంది. భారత్ సింధూ జలాల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రకటన విడుదల చేశారు. సింధూ జలాల ఒప్పందం పరిధిలోని అతిపెద్ద ఆనకట్టల్లో ఇది కూడా ఒకటి కావడం విశేషం."జూన్ నాటికి భాక్రానంగల్ ఆనకట్టను ఖాళీ చేయడం అవసరం. అప్పుడే వర్షాకాలంలో నదీ జలాలను నిల్వ చేసుకోవచ్చు. రిజర్వాయర్లో అప్పుడు నీరు లేకపోతే.. అదనపు జలాలు హరి-కె-పట్టాన్ నుంచి పాకిస్థాన్లోకి వెళ్లిపోతాయి. అది అటు పంజాబ్.. ఇటు హరియాణాకు ఉపయోగపడదు.

దిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదు. అలాంటి సమయంలో దిల్లీ ప్రజలను శిక్షించేలా అలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే అందుబాటులోకి రాలేదు. గత నెల భాక్రా బేస్ మేనేజ్మెంట్ బోర్డ్ విడుదల చేసిన నీటిలో పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీకి పోగా హరియాణాకు మిగిలింది కేవలం 6,800 క్యూసెక్కులు మాత్రమే. ఇక న్యాయంగా హరియాణాకు రావాల్సిన వాటా ఇచ్చినా.. అది భాక్రా ప్రాజెక్టులో నిల్వ ఉండే నీటిలో 0.0001 శాతానికి సమానం" అని నాయబ్ సింగ్ సైనీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చీనాబ్, జీలం సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని సైనీ కోరారు. ప్రస్తుతం భాక్రానంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్ నీటి అవసరాలను తీరుస్తోంది.

# యుద్ధానికి సిద్ధమవుతున్న వాతావరణం

- జాతీయ భద్రతా సలహాబోర్డు పునర్వ్యవస్థీకరణ
- చైర్మన్‌గా అలోక్ జోషి నియామకం



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించింది. అలాగే 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషిని ఆ బోర్డు చైర్మన్‌గా నియమించింది. ఈ ఘటన వేళ ఈ నియామకం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనతో పాటు ఆరుగురు సభ్యులు ఉన్నారు.

భారత సైన్యంలో పనిచేసిన మాజీ అధికారులు ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, అడ్మిరల్ మోంటీ ఖన్నా, మాజీ ఐపీఎస్‌లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్‌సింగ్, మాజీ ఐఎఫ్ఎస్ బి. వెంకటేశ్ వర్మ సభ్యులుగా ఉన్నారు. భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ భేటీలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశాలు కూడా జరిగాయి.

ఇదిలా ఉంటే.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనపై నిర్ణయం భద్రతా బలగాలదే అని నిన్న జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ స్వేచ్ఛ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని మట్టి కరిపించాలన్నది జాతీయ సంకల్పమని, దీనిని నెరవేర్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నామని అన్నారు. అలాగే బుధవారం వరుస భేటీలకు ప్రధాని అధ్యక్షత వహించడం చూస్తుంటే.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది.

# వచ్చే జనాభా లెక్కల్లోనే కులగణన

### కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

దేశంలో కులగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే జనాభా లెక్కల్లోనే దీనిని చేర్చుతామని కేంద్రం ప్రకటించింది. కులగణన పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించిందని, ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర కేబినెట్లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన వివరాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ)ను సూపర్ కేబినెట్గా వ్యవహరిస్తారు. బుధవారం జరిగిన భేటీలో కులగణనకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించాయన్నారు.



ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఏప్రిల్ 2020లోనే జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. గత రెండు రోజులుగా ఢిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో రక్షణమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాధిపతులతో సమావేశం జరిగింది. బుధవారం భద్రతపై కేబినెట్ కమిటీ భేటీ అనంతరం రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ జరిగింది.

# సింధూ జలాలపై పాక్ బీరాలు

## పరిమిత ఆప్షన్లతో ఉక్కిరిబిక్కిరి

పహల్గాంలో అమాయకులపై ఉగ్రదాడి తర్వాత భారత్ తీవ్రంగా స్పందించింది. పాక్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఈ చర్యలను ఏమాత్రం ఊహించని పాక్ షాక్‌కు గురైంది. 1960లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగ్గా.. 1965, 71, 99ల్లో యుద్ధాలు, సైనిక ఘర్షణలు చోటుచేసుకొన్నాయి. అయినా భారత్ ఈ ఒప్పందంలో కొనసాగింది. కానీ తాజా చర్యలతో పాక్‌లో ఆందోళన నెలకొంది. ఈ జలాలను మళ్లించడం లేదా ఆపడం చేస్తే.. దాన్ని యుద్ధానికి కవ్వింపు చర్యగా పరిగణిస్తామంటూ బీరాలు పలుకుతోంది.



### పాక్‌కు పరిమిత ఆప్షన్లు..

భారత్ నిర్ణయంతో పాకిస్థాన్ ఎదుట ఇప్పుడు ఆప్షన్లు పరిమితంగానే ఉన్నాయి. తాజాగా దీనిపై ఆ దేశ న్యాయశాఖ మంత్రి ఆకిల్ మాలిక్ స్పందించారు. న్యాయపోరాటం చేసేందుకు మూడు ఆప్షన్లను పరిశీలిస్తున్నట్టు ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించారు. ఈ ఒప్పందం కుదిర్చిన ప్రపంచబ్యాంకు వద్దకు వెళ్లే అంశం కూడా దానిలో ఉందని పేర్కొన్నారు. తొలుత భారత్ నిర్ణయాన్ని పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ లేదా అంతర్జాతీయ న్యాయస్థానం (హేగ్)లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. దీనికి భారత్ అంతర్జాతీయ ఒప్పందాలకు సంబంధించిన వియన్నా ఒడంబడికను ఉల్లంఘించినట్టు సాకు చెప్పవచ్చు. న్యాయ వ్యూహంపై ఇప్పటికే చర్చలు దాదాపు పూర్తయ్యాయని పాక్ మంత్రి మాలిక్ వెల్లడించారు. త్వరలోనే ఏ కేసులు దాఖలు చేయాలనే దానిపై నిర్ణయానికి వస్తామన్నారు.

ఇక మరో ఆప్షన్ కింద.. దౌత్యపరంగా ఈ అంశాన్ని ఐరాస భద్రతా మండలిలో లేవనెత్తే అవకాశం ఉందని మాలిక్ పేర్కొన్నారు. అన్ని బలమైన వేదికలపైకి ఈ అంశాన్ని తీసుకెళ్లే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఒప్పందం ఏకపక్షంగా నిలిపివేయడం ఏమాత్రం కుదరదని మాలిక్ వెల్లడించారు. అ ఒడంబడిక రద్దుకు సంబంధించి ఎటువంటి క్లాజ్ లేదని పేర్కొన్నారు.

### పాక్ ఆప్షన్లు పని చేస్తాయా..?

అంతర్జాతీయ న్యాయస్థానం ఎదుటకు పాక్ వెళ్లే అవకాశాలు దాదాపుగా లేవు. ఎందుకంటే ఐసీజే పరిధిలోకి వెళ్లాలంటే.. ఆయా దేశాల అంగీకారం తప్పనిసరి. ఇది పూర్తి లేదా పరిమిత అంగీకారం కావచ్చు. ఇందుకు ఆ దేశం తీర్మానం చేయాల్సి ఉంటుంది. అంతర్జాతీయ నియమ నిబంధనల క్రమాన్ని పాటించే భారత్.. ఈ అంశాలకు సంబంధించి ఐసీజే చట్టపరిధికి కట్టుబడి ఉంటామని ఆమోదిస్తూ 27 సెప్టెంబర్ 2019లో డిక్లరేషన్ ఇచ్చింది కానీ, దీనికి 13 మినహాయింపులను తీసుకొంది. ఈమేరకు మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆ డిక్లరేషన్‌పై సంతకం చేశారు.

13 మినహాయింపుల్లోనే ఓ మెలిక ఉంది. కామన్వెల్త్ గ్రూపులోని దేశాలతో వివాదాలు ఏర్పడితే మాత్రం.. అవి ఐసీజే పరిధిలోకి రావని నాడు పేర్కొంది. పాకిస్థాన్‌కు కామన్వెల్త్ సభ్యత్వం ఉంది. దీంతో ఆ దేశంతో వివాదం ఐసీజే పరిధిలోకి రాదు. ఇస్లామాబాద్ ఆ దిశగా చేసే ప్రయత్నాలు వృథా అవుతాయి. దీనికితోడు సాయుధ ఘర్షణలు, ఆత్మరక్షణ కోసం సమష్టి చర్యలు తీసుకొనే వేళ, దౌర్జన్యాలను అడ్డుకొనేటప్పుడు, తప్పనిసరిగా పూర్తి చేయాల్సిన బాధ్యతలు వంటి పలు అంశాల్లో కూడా ఐసీజే పరిధి చెల్లదని వెల్లడించింది. దీంతో పాక్ అంతర్జాతీయ న్యాయస్థానానికి వెళ్లినా ఒరిగేది ఏమీ ఉండదు.

### ప్రపంచ బ్యాంక్ ఎందుకు జోక్యం చేసుకోదు..

భారత్-పాక్ మధ్య సింధూ జలాల ఒప్పందాన్ని మధ్యవర్తిగా వ్యవహరించి కుదిర్చిందే ప్రపంచ బ్యాంక్. కానీ, దానికి చట్టబద్ధమైన పాత్ర ఏమీ లేదు. అంతేకానీ ఒప్పందాన్ని అమలుచేసే అధికారం లేదు. ఏమైనా అభిప్రాయభేదాలు వస్తే.. చర్చలకు మాత్రమే ప్రోత్సహించగలదు. తటస్థ నిపుణుల నియామకం, కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ చైర్మన్లను నియమించడం వరకే దాని పాత్ర పరిమితం. లేకపోతే.. వివాద పరిష్కార వ్యవస్థను ప్రపంచ బ్యాంక్ ఏర్పాటుచేసే అవకాశం ఉంది. కానీ, సూచనలు, సిఫార్సులకు భారత్ కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు.

---

# ఇంటికింద బంకర్.. ఇంటిచుట్టూ సెక్యూరిటీ

## పాక్ ప్రజలమధ్య దర్జాగా ప్రపంచ ఉగ్రవాది

పహల్గాంలో పర్యాటకులపై జరిపిన పాశవిక దాడి వెనక లష్కరే తోయిబా హస్తం ఉన్నట్టు ఇప్పటికే పలు కథనాలు వెలువడ్డాయి. ఈ దాడికి పాల్పడింది 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ముష్కరులే అయినా.. దీనికి కర్త, కర్మ, క్రియ మాత్రం లష్కరే తోయిబా చీఫ్, భారత మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది హాఫీజ్ సయీద్ అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ పరిణామాలవేళ హాఫీజ్‌కు సంబంధించి ఓ సంచలన వార్త వెలుగులోకి వచ్చింది. అతడు పాక్‌లో ప్రభుత్వ భద్రత మధ్య బహిరంగంగా జీవిస్తున్నట్టు తెలుస్తోంది. ఈమేరకు ఓ ఆంగ్ల మీడియా తమ కథనంలో వెల్లడించింది.

### ప్రైవేటు పార్క్, బంకర్..

సాధారణంగా ఉగ్ర నాయకులు ఎవరికీ తెలియని రహస్య ప్రదేశాల్లో దాక్కుని.. అక్కడినుంచే తమ కార్యకలాపాలకు సంబంధించి ఆదేశాలిస్తుంటారు. కానీ, హాఫీజ్ సయీద్ జీవనం మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నట్టు తెలుస్తోంది. అతడు లాహోర్‌లోని జోరమ్ తౌమ్ అనే అత్యంత రద్దీప్రాంతంలో సామాన్యపౌరులతో కలిసి నివసిస్తున్నట్టు సమాచారం. హాఫీజ్ నివాసం వద్ద పాక్ ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం భద్రత కల్పిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ భవనంలో హాఫీజ్ తన కుటుంబంతోపాటు నివసిస్తున్నారట. ఇంటిముందు ఓ ప్రైవేటు పార్క్, పక్కనే మసీదు, మదర్సా కూడా ఉన్నట్టు సమాచారం. భవనం కింద ఓ బంకర్ కూడా ఉందని సదరు కథనం పేర్కొంది.

### జైల్లో ఉన్నాడంటూ పాక్ బుకాయింపులు

హాఫీజ్ సయీద్ పాక్‌లో బహిరంగంగా తిరుగుతున్నట్టు గత కొంతకాలంగా కథనాలు వస్తూనే ఉన్నాయి. కానీ, ఆ దేశ ప్రభుత్వం మాత్రం వాటిని తోసిపుచ్చుతూనే ఉంది. ఉగ్ర సంస్థకు నిధులు సమకూర్చిన కేసులో అతడికి 31 ఏళ్ల జైలు శిక్ష పడిందని, అతడు జైల్లోనే ఉన్నాడని బుకాయిస్తోంది. 2019లో హాఫీజ్ అరెస్టయినట్లు కథనాలు వచ్చాయి. ఆ మధ్య హాఫీజ్ అనుచరులు,



లష్కరే ఉగ్రవాదుల వరుస హత్యలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ పరిణామాలతో అతడికి పాకిస్థాన్ భద్రత పెంచినట్టు తెలుస్తోంది. అతడి ఇంటినే సబ్ జైలుగా మార్చినట్లు వార్తలు వినిపించాయి. 2008 నవంబరు 26న దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో ఉగ్రమూకలు మారణహోమం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతోపాటు మరెన్నో ఉగ్ర దాడుల్లో హాఫీజ్ సయీద్ కీలక సూత్రధారిగా ఉన్నాడు. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన సయీద్‌ను.. ఐక్యరాజ్య సమితి కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడి తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డ్ ప్రకటించింది.

---

## ఇస్కాన్ కృష్ణదాస్‌కు బెయిల్

ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారికి బుధవారం బంగ్లాదేశ్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బంగ్లాదేశ్ జెండాను అగౌరవపర్చారని.. రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని ఆయనతో సహా 18 మందిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో గతేడాది అక్టోబర్ 30న ఆయనను చిట్టగాంగ్‌లో అరెస్టు చేశారు. అక్టోబర్ 25న లాల్దింగ్ మైదానంలో జరిగిన ర్యాలీలో బంగ్లాదేశ్ పతాకంకంటే ఎక్కువ ఎత్తులో కాషాయ జెండాను ఎగురవేయడంతో కేసులు నమోదయ్యాయి. ఆయన అరెస్టుపై ప్రపంచవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. ఒక దశలో అతని తరపున వాదించేందుకు సిద్ధమైన న్యాయవాదిపై కూడా దాడి జరిగింది. ఈ నేపథ్యంలో దాస్ భద్రతపై భారత్ పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసింది. ఇక ఆ తర్వాత నుంచి ఆయన ఎన్నిసార్లు న్యాయస్థానాల్లో బెయిల్ కోసం ప్రయత్నించినా లభించలేదు. ఎట్టకేలకు బుధవారం ఆయనకు న్యాయస్థానంలో ఊరట లభించింది. బంగ్లాదేశ్ సమ్మిళిత సనాతని జాగ్రణ్ జోటె అనే సంస్థకు దాస్ ప్రతినిధిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ గ్రూప్ మైనార్టీల హక్కులు, భద్రత విషయంలో పనిచేస్తుంది. ఆ దేశంలో మైనార్టీల రక్షణకు చట్టాలు తీసుకురావాలని ఆయన ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు.



---

# భారత్‌తో వాణిజ్య చర్చలు భేష్

## గొప్పగా జరుగుతున్నాయంటూ ట్రంప్ వ్యాఖ్య

భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. న్యూఢిల్లీపై అగ్రరాజ్యం దాదాపు 26 శాతం సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో దీనిపై ఒక ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరు దేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఈక్రమంలోనే వైట్ హౌస్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ ఒప్పందం గురించి వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయి. ప్రధాని మోదీ ఇటీవల అమెరికాకు వచ్చారు. ఆ సమయంలో సుంకాలపై ఒక ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. త్వరలోనే అది జరుగుతుందని భావిస్తున్నా' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇక, ఇదే అంశంపై అమెరికా




ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. ఇరు దేశాల మధ్య టారిఫ్ చర్చల్లో పురోగతి కనిపిస్తోందన్నారు. దీనిపై త్వరలో న్యూఢిల్లీ ఒక ప్రకటన చేసే అవకాశం ఉందనితెలిపారు. ఈసందర్భంగా ఇండియా వంటి సానుకూలమైన దేశాలతో చర్చలు జరపడం సులభమన్నారు. ఆ దేశ వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ ఓవార్తా సంస్థతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ వద్ద ఒక వాణిజ్య ఒప్పందం ఉందని, కానీ దానికి ఆ దేశ ప్రధాని, పార్లమెంటు ఆమోదం తెలపాలన్నారు. అయితే, ఆయన ఏ దేశం గురించి మాట్లాడుతున్నారనేది స్పష్టంగా తెలపలేదు.

ఈనెల ప్రారంభంలో ట్రంప్ పలు దేశాలపై టారిఫ్ల మోత మోగించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే 90రోజులపాటు ఈ సుంకాల అమలుకు అమెరికా విరామం ప్రకటించింది. ట్రంప్ విధించిన సుంకాలపై చాలా దేశాలు ప్రతీకార చర్యలు దిగాయి. అయితే, భారత్ మాత్ర విభిన్నంగా ఆలోచించి.. ప్రతి సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్యవాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు. ఈనేపథ్యంలోనే చర్చలు జరుగుతున్నాయి.

చైతన్య రథం
సినిమా
గురువారం 1 మే 2025


## నిర్మాతగానే ఎక్కువ నేర్చుకున్నా



నటిగా వైవిధ్యమైన పాత్రలతో అలరించిన సమంత నిర్మాతగానూ తొలి అడుగు వేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి సినిమా 'శుభం'. మే9న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నటిగాకంటే నిర్మాతగానే ఎక్కువ విషయాలు నేర్చుకున్నట్టు తెలిపారు. రిస్క్ తీసుకుంటేనే జీవితంలో ముందుకు సాగుతామన్నారు. "రిస్క్ తీసుకోకుండా అభివృద్ధిని ఆశించలేం. నాకు సవాళ్లను ఎదుర్కోవడం ఇష్టం. ఎన్నోసార్లు రిస్క్ తీసుకున్నాను. పదిహేనేళ్ల నా కెరీర్‌లో కథలగురించి తెలుసుకున్నాను. ఆ అనుభవం తోనే నిర్మాతగా మారాను. నాకు మంచి టీమ్ దొరికింది. సినిమాలో భాగమైనప్పుడు నటిగాకంటే నిర్మాతగా ఎక్కువ బాధ్యతలుంటాయని అర్థమైంది. ఎన్నో విషయాలను పరిశీలించాలి. నేను సినిమా షూటింగ్ సమయంలో ప్రొడ్యూసర్‌గా ఎన్నో విషయాల గురించి సమగ్రంగా తెలుసుకున్నాను. ఇంకా తెలుసుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని భావిస్తున్నాను. ఒకే రకమైన చిత్రాలకు పరిమితం కావాలని అనుకోవడం లేదు. ఎన్నో కథలు వినడానికి సిద్ధంగా ఉన్నాను. ఒక మహిళగా నాకు ఎలాంటి చిత్రాలు నచ్చుతాయో అలాంటి వాటిని నిర్మించాలని భావిస్తున్నా. రొటీన్‌కు భిన్నమైన కథలను రూపొందిస్తాను" అని తెలిపారు.



## హిట్-3.. టికెట్ ధరల పెంపు

నాని హీరోగా తెరకెక్కిన చిత్రం 'హిట్ 3'. శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం మే1న విడుదల కానున్న సంగతి తెలిసిందే. చిత్ర బృందం విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సినిమా టికెట్ ధరలు పెంచుకునేలా అనుమతి ఇచ్చింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.50 (జీఎస్టీతో), మల్టీప్లెక్స్‌లో రూ.75 (జీఎస్టీతో) పెంచుకునేలా వీలు కల్పించింది. సినిమా విడుదలైన నాటినుంచి వారంపాటు అదనపు ధరలు అమల్లో ఉండనున్నాయి. హిట్ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కిన మూడో సినిమా 'హిట్: ది థర్డ్ కేస్'. నాని సరసన శ్రీనిధిశెట్టి నటించారు.

బ్లో అప్



కియారా అద్వానీ

## అదేం బుద్ధో వాళ్లది..

ఇటీవల తన కొత్త సినిమా ప్రచారంలో భాగంగా జరిగిన ఈవెంట్‌లో నటి మౌనీరాయ్ న్యూలుక్‌లో కనిపించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె అందం కోసం శస్త్రచికిత్స చేయించుకున్నారని ప్రచారం జరిగింది. ఈ లుక్‌లో కొన్ని ఏఐ వీడియోలను కూడా క్రియేట్ చేసి షేర్ చేశారు. తాజాగా దీనిపై మౌనీరాయ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటివి ప్రచారం చేసేవారిని చూస్తే జాలి వేస్తుందన్నారు. "నా లుక్స్‌పై వచ్చిన ఎన్నో ఏఐ వీడియోలు చూశాను. అవి భయంకరంగా ఉన్నాయి. నా ముఖాన్ని వేరొకరి శరీరానికి అతికించారు. ఆ వీడియోలు చూడడానికి కూడా చాలా అసహ్యంగా ఉన్నాయి. ఇలాంటివి క్రియేట్ చేయడం వల్ల వారికి ఎలాంటి ఆనందం వస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కాదు. వారి లక్ష్యం ఏమిటనేది తెలియదు. ఇలాంటివారు ఎవరిలోనూ మంచిని చూడలేరు. నేను సోషల్ మీడియాను ఉపయోగించడం ప్రారంభించిన తొలినాళ్లలో నెగెటివ్ కామెంట్స్ చేసేవారి ప్రొఫైల్ ఓపెన్ చేసి వారి గురించి తెలుసుకొని బ్లాక్ చేసేదాన్ని.

ఇప్పుడు ఇలాంటి వారిని చూస్తే జాలి వేస్తోంది. వారికి సరైన బుద్ధిని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తాను. వారి లైక్‌ల కోసం సెలబ్రిటీలపై చెత్త సమాచారమంతా రాస్తారు" అని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మౌనీరాయ్ 'ది భూత్నీ' ప్రచారంలో బిజీగా ఉన్నారు. జయదత్ ప్రధాన పాత్రలో నటించిన సినిమాకు సిద్ధాంత్ సచ్దేవ్ దర్శకత్వం వహించారు. మే1న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.





## ఆ పాట కథలో భాగం

ఇటీవల వచ్చిన 'స్త్రీ 2' సినిమాలో 'ఆజ్ కీ రాత్' అంటూ ప్రేక్షకులను ఉర్రూతలూగించారు తమన్నా. ఇప్పుడు ఇదే జోష్‌తో 'రైడ్ 2'లో ఓ పాటతో అలరించనున్నారు. ఇటీవల విడుదలైన ఈ పాట ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. అయితే రైడ్ 2 చిత్రంలో పాటను ఉద్దేశపూర్వకంగా పెట్టారని .. కథతో సంబంధం ఉండదని కొన్ని వార్తలు ప్రచారం అవుతున్నాయి. తాజాగా వాటిని నిర్మాతలు ఖండించారు. అలాగే ఈ ఒక్క పాట కారణంగానే క్లియర్ 'యూ' సర్టిఫికెట్ రావాల్సిన సినిమాకు 'యూ/ఏ' వచ్చిందని సోషల్ మీడియాలో పోస్టు షేర్ అవుతున్నా యి. నిర్మాతలు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో దీనిపై కూడా స్పష్టతనిచ్చారు. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'రైడ్' 2'. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రాజ్‌కుమార్ గుప్తా తెరకెక్కిస్తున్న సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది."తమన్నాస్పెషల్ సాంగ్ కారణంగా దీని సెన్సార్ సర్టిఫికెట్ మారిందని కొందరుఅభిప్రాయపడుతున్నారు. దానిలో వాస్తవం లేదు. 'యూ' సర్టిఫికెట్ రావాలంటే సినిమాలో కొన్ని కట్స్ చేయాలని సూచించారు. మేం ఎలాంటి కట్స్ చేయలేదు. ఇక ఆ పాట కూడా ప్రచారం కోసం పెట్టలేదు. కథలో అది కూడా ఓ భాగమే. థ్రిల్లర్ సినిమాల్లో ఇలాంటి పాటలు బలవంతంగా అనిపిస్తాయనేది వాస్తవమే. కానీ, సినిమాచూస్తే దీనిపై అందరికీ స్పష్టత వస్తుంది"అని నిర్మాత భూషణ్‌కుమార్ తెలిపారు.

## ఆమె త్యాగం గొప్పది

తాజాగా పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్. ఈ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని.. ఇది తనకు ప్రేరణగా నిలుస్తుందని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సందర్భంగా తన భార్య షాలినిపై ప్రశంసలు కురిపించారు. ఆమె ఎన్నో త్యాగాలు చేసినట్టు చెప్పారు. "నేను ఇప్పటికీ సామాన్యుడిలానే ఆలోచిస్తాను. ఇంతటి విజయాన్ని సాధించినందుకు ఒక్కోసారి ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది. ఈ స్థాయిలో ఉండడానికి నా భార్య షాలినినే కారణం. ఆమె నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది. ప్రతి పనిలోనూ నాకు తోడుంటుంది.

ఒక్కోసారి నేను సరైన నిర్ణయాలు తీసుకోకపోయినా ఆమె అండగా నిలిచింది. నన్ను ఎప్పుడూ నిరుత్సాహ పరచలేదు. నా కష్ట సమయాల్లో పక్కనే ఉండి భరోసానిచ్చింది. నా జీవితంలో సాధించిన సక్సెస్ క్రెడిట్ అంతా ఆమెకే ఇస్తాను. ఎంతో ప్రజాదరణ పొందిన నటి అయినప్పటికీ నాకోసం అన్నిటికీ దూరమైంది. ఆమెకు ఎంతోమంది అభిమానులు ఉన్నారు. వారందరికీ కూడా నేను ఈసందర్భంగా కృతజ్ఞతలు చెబుతున్నాను" అని చెప్పారు.

"నేను కేవలం నటుడిని. నటన నాకు జీతాన్నిచ్చే ఓ ఉద్యోగంగా భావిస్తాను. సూపర్‌స్టార్ అని పిలిపించుకోవడం నచ్చదు. ఎందుకంటే అలాంటి ట్యాగులపై నాకు నమ్మకం లేదు. 33 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. నా వృత్తిని ప్రేమిస్తాను. జీవితమంతా అభిమానులను అలరించడానికే ప్రయత్నిస్తాను. సాధ్యమైనంతవరకూ సాదాసీదాగా ఉంటాను. అతిగా ఆలోచించను. ఒకేసారి ఎక్కువ ప్రాజెక్టు అంగీకరించను. నటనతో పాటు నా ఇతర ఆసక్తులపై కూడా దృష్టిపెడతాను" అని అజిత్ తెలిపారు.

